ప్రజాశక్తి

సోమవారం 7 జులై 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

అంతా కొంటారా?

- పొగాకు కొనుగోలు మందగమనం
- మొత్తం ఉత్పత్తి అంచనా 30 వేల టన్నులు
- 15 రోజుల్లో కొనుగోలు చేసింది 2088 టన్నులు
- మూడు నెలలుగా ఇబ్బంది పడుతున్న రైతులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో హెచ్‌డి బర్లీ పొగాకు కొనుగోలు మందగమనంగా ఉంది. ధరలు పడిపోయి దాదాపు మూడు నెలల పాటు రైతుల ఆందోళన చేసిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని మార్క్‌ఫెడ్ ద్వారా గత నెల 19 నుంచి మొత్తం 11 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అయితే ఈ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటులోనే రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. పొగాకు పండించే ప్రాంతాల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల రైతులు పొగాకు కొనుగోలు కేంద్రాలకు తీసుకురావడానికి నానా తంటాలు పడుతున్నారు. తీరా కొనుగోలు కేంద్రానికి వచ్చిన తరువాత నాణత్య, ఇతర ఆంక్షలతో తిరస్కరిస్తున్నారు. దాదాపు 15 రోజులుగా 11 కేంద్రాల్లో కొనుగోలు చేసిన పొగాకు బేళ్ల కేవలం 2,245 మాత్రమేనని మార్క్‌ఫెడ్ రాష్ట్ర ఎమ్‌డి (ఇన్‌ఛార్జి) ఢిల్లీరావు ప్రకటించారు. ఇది 2088 మెట్రిక్ టన్నులతో సమానం. మొత్తం 724 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన ఈ పొగాకు విలువ రూ.17.20 కోట్లుగా నిర్ధారించారు.

కొనుగోలును వేగవంతం చేయాలి : సిపిఎం

ఉమ్మడి జిల్లాలో ఎక్కువ కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే తీవ్ర జాప్యమైందని, మళ్లీ కొత్త పంటలకు తరుణం ఆసన్నమైందని, ఈ దశలో మూడు నెలలుగా ఇబ్బంది పడుతున్న రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



పొగాకులో తేమశాతాన్ని పరీక్షిస్తున్న అధికారులు

బాపట్ల జిల్లాలో ఇంకొల్లు, పంగులూరు, పర్చూరు, బీకే పాలెం (ప్రైవేట్ గిడ్డంగి), చీరాల, గుంటూరు జిల్లాలో గుంటూరు, పెదకాకాని, పల్నాడు జిల్లాలో చిలకలూరిపేట, యడ్లపాడు, ప్రకాశం జిల్లాలో గుండ్లపల్లి తదితర ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో మొత్తం దాదాపు రెండు లక్షల ఎకరాల్లో బర్లీ పొగాకు సాగవగా 30 వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి మార్కెట్‌లోకి వచ్చిందని అంచనా. రైతుల నుంచి ఇప్పటి వరకు కొనుగోలు చేసింది 2088 మెట్రిక్ టన్నులు కాగా మిగతా పొగాకు కొనుగోలు ఎప్పటికి

▶ 2లో

22 వేల మందిలో 3 వేల మందికే పట్టాలు

- ఎన్నికల హామీలను లోకేష్ నిలబెట్టుకోవాలి
- నేటికీ న్యాయానికి నోచని పుష్కరాల బాధితులు
- సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకూ న్యాయం చేయాలి
- సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజి

ప్రజాశక్తి- తాడేపల్లి

మంగళగిరి నియోజకవర్గంలో తాడేపల్లి పట్టణంతో కలుపుకొని వివిధ ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న 22 వేలమంది ఇళ్ల పట్టాల కోసం ఎదురు చూస్తున్నారని, అయితే 3 వేల మందికే పట్టాలతో మంత్రి లోకేష్ సరిపెట్టారని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. తాడేపల్లికి ఆదివారం వచ్చిన ఆయన స్థానిక మేక అమరారెడ్డి భవన్లో విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు అర్హులందరికీ ఇంటి పట్టాలు ఇస్తానని లోకేష్ వాగ్దానం చేశారని, తొలి విడతగా 5000 ఇళ్ల పట్టాలు ఇస్తున్నామని ప్రభుత్వం ప్రచారం చేసినా 3 వేల మందికే ఇచ్చారని అన్నారు. తాడేపల్లి పట్టణంలో బైపాస్ రోడ్‌లో పెద్ద ఎత్తున అపార్ట్మెంట్, విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీ నిర్మాణాలు జరుగుతున్నాయని, ఇక్కడ ప్రధానంగా మురుగు సమస్య తీవ్ర వేసిందని, అండర్ గ్రౌండ్ డ్రెయినేజ్ నిర్మాణ హామీని అమలు చేయాలని కోరారు. పట్టణాల్లో ఇళ్ల స్థలాలు లేని వారిని గుర్తించి రెండు సెంట్లు స్థలం ఇస్తానన్న వాగ్దానం మేరకు తాడేపల్లి ప్రాంతంలో 6000 మంది ఇళ్ల స్థలాలకు అర్హులున్న ప్రభుత్వ అధికారులకు గుర్తించారని తెలిపారు. వారందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో రాజధానిలో ఇళ్ల స్థలాలిచ్చిన వారి జాబితా ప్రకారం న్యాయం చేయాలన్నారు. తాడేపల్లి సీతానగరంలో పుష్కరాల బాధితుల గోడు వర్ణనాతీతంగా ఉందని చెప్పారు. మళ్లీ పుష్కరాలు రాబోతున్నా వారి సమస్య పరిష్కారానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 225 రోజుల నుండి దీక్షలు చేస్తున్న, 300 కుటుంబాలతో ముడిపడి ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యనూ పరిష్కరించాల్సిన బాధ్యత మంత్రి లోకేష్‌పై ఉందన్నారు. తాడేపల్లి మహానాడులో రూ.కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణం జరగబోతుందని ప్రకటనలే గాని కార్యరూపం దాల్చడం లేదని అన్నారు. అర్హులైన వారందరికీ పింఛన్లు ఇస్తామని ఎన్నికలప్పుడు చెప్పినా ఇప్పటికీ

▶ 2లో

పాఠశాలల్లో సెల్‌ఫోన్‌తో పనిలేని విధానం రావాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు - 2 లో

గాజా కోసం సాంకేతిక మౌనం : సిపిఎం

ప్రజాశక్తి-గుంటూరు

గాజాపై ఇజ్రాయిల్ పాల్పడుతున్న దుర్మార్గ దాడిపై ప్రపంచవ్యాప్త నిరసనల్లో భాగంగా మన దేశంలో సిపిఎం అఖిల భారత కమిటీ పిలుపు మేరకు డిజిటల్ మౌనం పాటించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు. గాజా కోసం మౌనం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రజలు ప్రతిరోజూ రాత్రి 9 గంటల నుండి 9.30 గంటల వరకు ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసి సంఘీభావం తెలపాలని కోరారు. ఇజ్రాయిల్ దాడి వల్ల ఇప్పటికే లక్షలాది మంది గాజాను వదిలి ఇతర దేశాలకు వలస వెళ్లారని, మహిళలు, పిల్లలు సహా దాదాపు 64,118 మంది చంపబడ్డారని, 1,59,873 మంది క్షతగాత్రులయ్యారని తెలిపారు. ఇతర దేశాలు, రెడ్‌క్రాస్ వంటి సంస్థలు సహాయక చర్యలకు పూనుకున్నా ఇజ్రాయెల్ అడ్డుకుంటోందని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా సాంకేతిక సంస్థలు కూడా ఈ దాడికి సహకరిస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయ సమాజం ఈ రకమైన సాంకేతిక బంద్‌కు పిలుపునిచ్చిందని నేతాజి తెలిపారు.

రాష్ట్రంలోనే ప్రత్యేకంగా పల్నాడు బాలోత్సవం

- విద్యార్థుల్లో మరింతగా విస్తరించాలి
- నిర్వాహకులు, న్యాయ నిర్ణేతల అభినందన సభలో వక్తలు
- కమిటీ నూతన అధ్యక్షునిగా డాక్టర్ మస్తాన్ షరీఫ్ ఎన్నిక

8 లో

ఈ-శ్రమ కార్డుతో కార్మికులకు మేలు

- ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలి
- ప్రజాశక్తితో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ గాయత్రీదేవి

2 లో



అదే మిల్లులో మరో 60 టన్నులు!

భారీగా రేషన్ బియ్యం స్వాధీనం - గతంలో 10 టన్నుల బియ్యంను స్వాధీనం చేసుకున్న మంత్రి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గ పరిధిలోని వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడులో రేషన్ బియ్యం భారీ నిల్వలను అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. స్థానిక శ్రీవల్లి రైస్ మిల్లులో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారనే సమాచారం మేరకు డిఎస్పీ జి.భానోదయ, సిఐ రమానాయక్ తనిఖీలు చేపట్టారు. 60 టన్నులకుపైగా నిల్వలను గుర్తించి రెవెన్యూ, సివిల్ సప్లయీస్ అధికారులకు తెలిపారు. వట్టిచెరుకూరు తహశీల్దార్ క్షమారాణి, సివిల్ సప్లయీస్ డిప్యూటీ తహశీల్దార్ శివశంకర్ వెంటనే మిల్లు వద్దకు చెరుకుని బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఇదే మిల్లులో ఏడు నెలల కిందట రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీ చేసి అక్రమంగా నిల్వ ఉంచిన 10 టన్నుల రేషన్ బియ్యం పట్టుకున్నారు. ఇకపై అక్రమ రవాణాకు తావివ్వబోమని ప్రకటించారు. అయినా ప్రస్తుతం అదే మిల్లులో అంతకంటే ఎక్కువ బియ్యం పట్టుబడడం చర్చనీయాంశమైంది.



ఫణిదంలో రైతులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు పాశం రామారావు తదితరులు

భూ సమీకరణపై రైతుల్లో వ్యతిరేకత

రాజధానిలోని పలు గ్రామాల్లో పర్యటించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి -తాడికొండ

రాజధాని అభివృద్ధికి రెండోదశ భూ సమీకరణపై తాడికొండ మండలంలోని రైతుల్లో తీవ్ర వ్యతిరేకత గూడు కట్టుకుందని సిపిఎం జిల్లా కారదర్శివర్గ సభ్యులు పాశం రామారావు, ఈమని అప్పారావు తెలిపారు. ఆదివారం తాడికొండ మండలంలోని ఫణిదం, దామరపల్లి, గరికపాడు, బండారుపల్లి గ్రామాల్లో ప్రజాసంఘాల నాయకులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు, వ్యవసాయ కార్మికులతో మాట్లాడారు. రాజధాని నిర్మాణానికి మరో 44వేల ఎకరాల భూసమీకరణకు రాష్ట్ర ప్రభుత్వం తాడికొండ మండలంలో ప్రజాభిప్రాయం కోరుతూ పలు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించింది. ఈ సభల్లో రైతులు తీవ్రంగా భూ సమీకరణకు వ్యతిరేకించారని నాయకులు తెలిపారు. నూటికి 70శాతం మంది రైతులు తమ భూములు ఇవ్వడానికి నిరాకరించారని తమకు తెలిపినట్లు నాయకులు చెప్పారు. గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులు ఉన్నారని, దీనికి తోడు మరికొంత భూమి కౌలుకు తీసుకుని జీవనం కొనసాగిస్తున్నామని ఇప్పుడు ప్రభుత్వం ఆ భూమిని తీసుకుంటే తాము ఏలా బ్రతకాలని ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో ప్రత్తి, మిర్చిప్రధాన పంటలుగా ఉన్నాయని, దీనికి తోడు గుంటూరు నగరానికి చేరువుగా ఉన్న తమ గ్రామాల భూములకు ప్రభుత్వం నిర్ణయించిన ప్యాకేజీ ఏ మాత్రం చాలదని తెలిపారు.అనేక మంది బ్యాంకుల్లోను, ఇతర వడ్డీ వ్యాపారుల వద్ద తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని వాటిని తీర్చాల్సిన సమయంలో భూములు తీసుకుంటే పరిస్థితి ఏంటని ప్రతినిధి బృందం ముందు వాపోయారు. గతంలో

▶ 2లో

మిషన్ గ్రీన్ అమలుపై నేడు సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో ఆహ్లాదకరమైన హరిత వాతావరణం అందించడానికి మిషన్ గ్రీన్ అమలు, వీధి వ్యాపారులకు జోన్ల ఏర్పాటు అంశాలపై స్టేక్ హెూల్డర్స్, సీనియర్ సిటిజన్స్ సూచనలు, సలహాలు కోసం నేడు మధ్యాహ్నం మధ్యాహ్నం 3:30 గంటలకు ఎమ్మెల్యేలు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లకు, కార్పోరేటర్లకు, 8వతేదీ సాయంత్రం 4 గంటలకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కావున నగరంలోని స్టేక్ హెూల్డర్స్, సీనియర్ సిటిజన్స్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు, కార్పోరేటర్లు హాజరై తమ సూచనలు అందించాలని కోరారు.

భూ సమీకరణపై రైతుల్లో వ్యతిరేకత

(మొదటి పేజీ తరువాయి)

సీడ్ క్యాపిటల్ పరిధిలో 29గ్రామల్లో తీసుకున్న భూములు, రైతులకు ఇచ్చిన ప్లాట్లు ఇంకా అభివృద్ధి చేయలేదని, మరో 44వేల ఎకరాలను ఎలా అభివృద్ధి చేస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో తమభూములు రాజధానికి ఇవ్వాల్సి వస్తే ఎకరాకు 1500 గజాలు, కమర్షియల్ ప్లాట్‌లు 500 గజాలు ఇవ్వాలని, రుణాలు రద్దు చేయాలని కొద్దిమంది రైతులు తెలిపారు. వార్షిక కౌలు రూ.40వేలు ఇవ్వాలని కోరుతున్నారు. భూమిలేని వ్యవసాయ కార్మికులకు, కౌలురైతులు, ఇతర వృత్తిదారులకు నెలకు రూ.10వేల చొప్పున పింఛన్లు ఇవ్వాలని కోరారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం ప్రజల మనోభావాలు దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో కేటాయించిన భూమలు అభివృద్ధి చేసి నిర్మాణ పనులు ప్రారంబించాలని, ఈ ప్రాంతంలో ఉపాధిని కల్పించే భారీ పరిశ్రమలు స్థాపించాలని, రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు రాబట్టాలని, రాజధానికి చట్టబద్దత కల్పించాలని ప్రతినిధి బృందం సభ్యులు కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, నాయకులు వై.కృష్ణ పాల్గొన్నారు.

22 వేల మందిలో 3 వేల మందికే పట్టాలు

(మొదటి పేజీ తరువాయి)

ఒకరికి కూడా కొత్తగా మంజూరు చేయలేదని విమర్శింకచారు. సామాజిక పింఛన్ల కోసం అనేకమంది ఎదురుచూస్తున్నారని చెప్పారు. తాడేపల్లి ఫారెస్ట్ ప్రాంతంలో నివాసం ఉంటున్న వారికి మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని, రైల్వే స్థలాల్లో నివాసముంటున్న వారికి పట్టాల అందజేస్తామని, బకింగ్ హోమ్ కాల్వపై డబల్ లైన్ బ్రిడ్జి నిర్మిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని కోరారు. ఇచ్చిన హామీలను ఎప్పటికి అమలు చేస్తారో ప్రజలకు చెప్పాలని కోరారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, నాయకులు డి.విజయభాస్కర్‌రెడ్డి, ఎన్.దుర్గారావు పాల్గొన్నారు.



దేవస్థానానికి పోటెత్తిన సందర్శకులు

ప్రజాశక్తి - మంగళగిరి

శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థననానికి తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం యాత్రికులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ప్రతిరోజు ఎగువ దిగువ సన్నిధిలకు ఉచిత బస్సు సౌకర్యం ఉండేది. ఉచిత బస్సు సౌకర్యం లేకపోవడంతో యాత్రికులు ఇబ్బందులు పడ్డారు. దేవస్థానం అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడం వలన యాత్రికులు ఇబ్బందులకు గురయ్యారు.

పాఠశాలల్లో సెల్‌ఫోన్‌తో పనిలేని విధానం రావాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - తెనాలి



పాఠశాలల్లో సెల్‌ఫోన్‌తో పని లేని విధానం కావాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు కోరారు. యుటిఎఫ్ గుంటూరు జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షులు యు.రాజశేఖర్ అధ్యక్షతన స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సెల్‌ఫోన్ ప్రభావంతో పిల్లలు పాడవుతున్నారని, ఉపాధ్యాయుల భోదన పైనా ప్రభావం పడుతోందని అన్నారు. రోజువారీ యాప్‌లతో రకరకాల సమాచారం అప్‌లోడ్, డౌన్‌లోడ్‌తోనే ఉపాధ్యాయులు తల మునకలవుతున్నారని చెప్పారు. రకరకాల సమాచారం పంపడం, ఆన్‌లైన్ శిక్షణలతో ఉపాధ్యాయుల బోధన సమయం హరించుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు కూడా బోధన సమయంలో సెల్‌ఫోన్‌ను నియంత్రణలో ఉంచాలని ఆయన కోరారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరం మేరకు మాత్రమే వినియోగించుకోవాలని, అతిగా ఆధార పడితే, దానికి బానిసగా మారి కర్తవ్యం మరుగునపడే ప్రమాదం ఉందని అన్నారు. బోధన సమయాన్ని పిల్లలకు మాత్రమే కేటాయించాలని, పాఠశాల రోజువారి పనిని మెరుగుపరచాల్సిన అవసరం ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులపై ఉందని చెప్పారు. ప్రభుత్వ బడి పట్ల నమ్మకంతో విద్యార్థుల్ని పంపించిన తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా నాణ్యమైన విద్య ఇచ్చే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. అవసరమైతే అదనంగా ఒక గంట పాఠశాలలో సమయాన్ని గడిపి విద్యార్థులకు బోధన చేయాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణ విభాగం చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ పిటిఎంను ఈవెంట్‌గా కాకుండా, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విధంగా నడపాలని, విట్నెస్ అధికారిని నియమించాలనే ఉత్తర్వులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ టి.ఎస్.మల్లేశ్వరరావు మాట్లాడుతూ 12వ పిఆర్‌సి చైర్మన్‌ను తక్షణం నియమించాలని, ఆర్థిక బకాయిలు చెల్లించాలని కోరారు. గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్, ఎం.కళాధర్ మాట్లాడుతూ బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ పూర్తయిందని, వచ్చిన ఉపాధ్యాయులకు డిడిఒ కోడ్స్, పొజిషన్ ఐడీలు కేటాయించి జీతాలు ఈ నెలలోనే చెల్లించాలని కోరారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, కోశాధికారి గయాను ద్దౌలా, జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

పౌర నిఘాతోనే నగర సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడుతున్న నారాయణరెడ్డి

నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న త్రాగునీరు, పారిశుద్ధ్య సమస్యలకు పరిష్కారం పౌర నిఘాతోనే సాధ్యమని ది గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జనచైతన్య వేదిక హాల్లో అసోసియేషన్ సమావేశం సామాజిక విశ్లేషకులు టి.ధనుంజయరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. నారాయణరెడ్డి మాట్లాడుతూ గత 3 ఏళ్ళుగా నగరంలోని 62 మంచినీటి ట్యాంకులను నిశితంగా పరిశీలించి, వాటిలో పేరుకు పోయిన మురికిని తొలగించడంలో రేట్ పేయర్స్ అసోసియేషన్ విశిష్ట కషి చేసిందన్నారు. 30కి పైగా నీళ్ల ట్యాంకులలో పేరుకుపోయిన టన్నుల కొద్దీ మురికిని అధికార బందం సహకారంతో తొలగించడం గర్వ కారణమన్నారు. అలాగే నగరంలో 1975 మంది పారిశుద్ధ్య కార్మికులు, 57 ట్రాక్టర్లు ఉన్నప్పటికీ పారిశుద్ధ్య సమస్య పరిష్కారం కావట్లేదన్నారు. 2.80 లక్షల నివాస గహాలకు జిఎంసి మంచినీటి సరఫరా చేస్తుందన్నారు. 200కు పైగా ఉన్న సచివాలయాలను గుంటూరు నగర అభివద్ధిలో భాగస్వామ్యం చేయాలన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ పటిష్టమైన గ్రీవెన్స్ సెల్ ను రూపొందించి బలోపేతం చేయాలని, గుంటూరు నగర ప్రజలకు టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులో ఉంచి, ఫిర్యాదులు స్వీకరించి, సమస్యల పరిష్కారంవైపు దష్టి సాధించాలన్నారు. వీడి వ్యాపారులకు ప్రత్యేక కూడళ్లు ఏర్పాటు కృషిని కొనసాగించాలని, ప్రతి 350 గృహాలకూ పారిశుధ్య కార్మికుల్ని కేటాయించి, వారి వివరాలను గృహ యజమానులకు అందించటం ద్వారా పౌర నిఘా పెరిగి, సత్ఫలితాలు వస్తాయన్నారు. మానవత కార్యదర్శి కె.సతీష్‌బాబు మాట్లాడుతూ ప్రతిరోజు గుంటూరులో వీధి వ్యాపారుల నుండి రూ.40వేలు వసూలు చేస్తున్న వారు కార్పొరేషన్‌కు మాత్రం రూ.2వేలు మాత్రమే చెల్లించటం బాధాకరమన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఉన్న హోర్డింగ్స్ నుండి సక్రమంగా పన్నులు రాబట్టలేకపోవడం వలన ఆదాయాన్ని కోల్పోతున్నా మన్నారు. అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ గత మూడేళ్లలో ఇంటి పన్ను రెట్టింపు అయ్యిందని, దీనికి తగ్గట్టుగా పౌరసేవలు మెరుగవ్వ ట్లేదన్నారు. ప్రతి పౌరుడు ప్రశ్నించే లక్షణాన్ని అలవర్చు కోవాలని హితువు పలికారు. సామాజిక విశ్లేషకులు టి.ధనుంజయరెడ్డి మాట్లాడుతూ పౌరసంస్థలు రేట్ పేయర్స్ అసోసియేషన్‌లో భాగస్వాములుగా మారి నాణ్యమైన పౌర సేవలను సాధించుకునేందుకు కషి జరగాలన్నారు.సమావేశంలో మానవత చైర్మన్ పావులూరు రమేష్, రేట్ పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్.అంజి రెడ్డి, సంయుక్త కార్యదర్శి వి.సదాశివరావు, శ్యామలనగర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ నేత కనపర్తి రాఘవరావు, విశ్రాంత ఫార్మసిస్ట్ అన్నపూర్ణమ్మ ప్రసంగించారు.

అంతా కొంటారా?

(మొదటి పేజీ తరువాయి)

పూర్తవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. సెప్టెంబర్ వరకు కొంటామని అధికారులు చెబుతున్నా అప్పటిలోగా 30 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు సాధ్యమా అనే ప్రశ్నలొస్తున్నాయి.

ప్రభుత్వానికి గిడ్డంగులు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో గుంటూరు, పెదకాకాని తదితర ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా దూర ప్రాంతాల నుంచి పెదనందిపాడు, కాకుమాను ప్రాంతాల నుంచి రైతులు రావాల్సి వస్తోంది. రవాణా ఛార్జీలు, అనేక వ్యయ ప్రయాసలకు వొనర్చి వచ్చిన రైతులకు కచ్చితంగా కొనుగోలు చేస్తారనే గ్యారంటీ లేకుండా పోయింది. రైతులు తమ పేర్లు, వివరాలు సిఎం యాప్‌లో గ్రామ వ్యవసాయ సహాయకుల సహాయంతో నమోదు తప్పనిసరి చేశారు. ఎపి ఎయిమ్స్ పోర్టల్ ఆధారంగా నమోదైన వారికి మాత్రమే కొనుగోలుకు అవకాశం ఉంటుంది. ఎస్ఎంఎస్ ద్వారా కొనుగోలు సమాచారాన్ని ముఖ్యంగా కొనుగోలు తేదీ, కేంద్రం, పరిమాణాన్ని రైతులకు తెలియజేస్తామని చెప్పినా ఎక్కువ మంది రైతులు నిరక్ష్యరాస్యులు కావడం వల్ల వారికి ఈ సమాచారం సకాలంలో తెలియడం లేదు. నిర్దేశించిన రైతులకే కొనుగోలుకు అనుమతి ఇస్తున్నారు. బేల్ నాణ్యత ప్రమాణాలు కూడా నిర్దేశించారు. తోరణం తీగలు తొలిగించి శుభ్రంగా, సమమైన ఆకృతిలో ఉండాలని, తేమ 20 శాతం కంటే తక్కువ ఉండాలని, బేల్ బరువు 25 నుంచి 150 కిలోల మధ్య ఉండాలని, పండుగుల్ల పొగాకు ఉండకూడదని, ఇతర వ్యర్థ పదార్థాలు లేకుండా జాగ్రత్త తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. పట్టాను బట్టి తరుగు వివరం నిర్ధారిస్తున్నారు. సన్నని పట్టాకు ఒక కిలో తగ్గింపు, మందపాటి పట్టాకు 2 కిలోల తగ్గింపు వుంటుందని తెలిపారు. గ్రేడింగ్, ధరలు కూడా నిర్ణయించారు. హెడ్‌ఆర్ రకం శుభ్రంగా, తేనెరంగు, దఢమైన, మెత్తదనమున్న పరిపక్వ ఆకుగా ఉంటే కిలో రూ.120 చొప్పున క్వింటాలు రూ.12వేలుగా నిర్ధారించారు. హెడ్‌డిఎం రకం మధ్యస్థ పరిమాణ, లేత తేనెరంగు, మెత్తదనంతో ఉంటే కిలో రూ.90 చొప్పున క్వింటాలు రూ.9 వేలు, హెడ్‌డిఎక్స్ రకం పలుచటి ఆకులు, బూడిద రంగు, మిశ్రమంలో ఉంటే కిలో రూ.60 చొప్పున క్వింటాళ్ రూ.6 వేలు నిర్ధారించారు. అయితే 20 శాతానికి మించిన తేమ ఉన్న బేళ్లు నాణ్యతా ప్రమాణాలు లేవనే కారణాలతో పలువురు బేళ్లను తిరస్కరిస్తున్నారు.

సర్పంచ్‌పై దాడి వెనుక వైసిపి కుట్ర : నరేంద్ర

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి :పొన్నూరు మండలం మన్నవ గ్రామంలో ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణను అడ్డుపెట్టుకుని వైసిపి రాజకీయ లబ్ధి పొందేందుకు తప్పుడు ఆరోపణలు చేస్తోందని ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర విమర్శించారు. గుంటూరులోని టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సర్పంచ్ నాగమల్లేశ్వరరావుపై దాడి ఘటన జరిగిన టీ స్టాల్ ప్రదేశం వైసిపికి చెందిన వారిదేనని చెప్పారు. సంఘటన జరిగిన సమయంలో వీరితో పాటు మరో ముగ్గురు వైసిపి కార్యకర్తలు అక్కడే ఉన్నారన్నారు. సీసీటీవీ పుటేజీలో గొల్ల చౌదరితో పాటు మరో ఇద్దరు వ్యక్తులు కూడా కనిపిస్తున్నారని, వాస్తవాలను దాచిపెట్టి టిడిపికి చెందినవారే ఉన్నారని పోలీసులకు సమాచారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. నాగమల్లేశ్వరరావు గాయపడిన తరువాత అంబులెన్సులను కాదని ఆటోలో వైసిపి నాయకురాలకు చెందిన ఆసుపత్రిలో ఎందుకు చేర్పించారన్నారు. దాడి జరిగిన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లకుండా, వైసిపి నాయకురాలు ఆసుపత్రికి ఎందుకు తీసుకువెళ్లారు? అని ప్రశ్నించారు. ఈ ఘటనపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి : ఎస్పీ

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి : ప్రణాళికాబద్ధమైన సమాచార వ్యవస్థ సమన్వయంతో ట్రాఫిక్ నిర్వహణను చేపట్టాలని జిల్లా ఎస్పి సతీష్ కుమార్ కోరారు. గుంటూరు నగరంలో శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో వాహనాల మళ్లింపులపై ఆదివారం ఆయన నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ట్రాఫిక్ మళ్లింపులను స్వయంగా పరిశీలించారు. వాహనాల రాకపోకల రద్దీ ఎక్కువగా ఉండే రహదారులు, ప్రధాన కూడళ్లు, ట్రాఫిక్ మళ్లింపులు వద్ద తగినంత మంది ట్రాఫిక్ సిబ్బందిని కేటాయించాలన్నారు. వర్షం వచ్చినప్పుడు కంకర గుంట రైల్వే అండర్ బ్రిడ్జి, మూడు వంతెనల మార్గం వద్ద వర్షపు నీరు ఎక్కువగా చేరడం వల్ల వాహనదారులు ప్రయాణం చేయలేకపోతున్నారని ట్రాఫిక్ పోలీస్ అధికారులు ఎస్పీ దృష్టికి తేగా కలెక్టర్, కమిషనర్‌తో చర్చిస్తామన్నారు.

విద్య ద్వారానే అభివృద్ధి

ప్రజాశక్తి-గుంటూరు : యాంత్రికరణ నేపథ్యంలో విశ్వబ్రాహ్మణులు కులవత్తులకు దూరమై ఆర్థిక, రాజకీయ, సామాజిక వెనుకబాటుకు గురయ్యారవుతున్నారని, ముందు తరాల భవిష్యత్తును దష్టిలో పెట్టుకొని విద్యతో అభివద్ధిలో ముందడుగు వేయాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, రావూరి భరద్వాజ అవార్డు గ్రహీత నూతలపాటి నాగేశ్వరరావు అన్నారు. శ్రీవిశ్వకర్మ పేద విద్యార్థి సంక్షేమ సంఘం 28వ వార్షికోత్సవం స్థానిక అరండల్‌పేటలో నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన వ్యవస్థాపకులు గోనుగుంట శేషగిరిరావు మాట్లాడుతూ గత 28 సంవత్సరాలుగా దాతల సహకారంతో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటు పుస్తకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వేదోపాధ్యాయులు ఆలూరి సుబ్రహ్మణ్య శర్మ, ప్రముఖ చిత్రకారులు పాములపాటి శివరామకృష్ణను గౌరవ పురస్కారాలతో ఘనంగా సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మాచర్ల



జిల్లెళ్ల రామిరెడ్డి

రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలో ఆదివారం చోటు చేసు కొంది. నెహ్రూనగర్ రెండవ లైన్లో నివాస ముండే ఇటుకల బట్టీ వ్యాపారి జిల్లెళ్ల రామిరెడ్డి (55), వెంగళరెడ్డి బైక్‌పై వెళుతుండగా చంద్రవంక బ్రిడ్జిపై మాచర్ల డిపోకు చెందిన ఆర్టీసీబస్ గుంటూరుకు వెళుతూ బైక్‌ను ఓవర్ టేక్ చేసింది. ఆ సమయంలో బైక్ హ్యాండిల్ బస్‌కు తగలటంతో బైక్ అదుపు తప్పి పడిపోయింది. రామిరెడ్డి కుడి వైపుకు, వెంగళరెడ్డి ఎడమ వైపుకు పడిపోయారు. రామిరెడ్డిపైకి బస్సు టైర్లు ఎక్కటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంగళరెడ్డికి స్వల్ప గాయా లయ్యా యి. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటీలో త్రాసు పాము

ప్రజాశక్తి- తాడేపల్లి : పట్టణంలోని కత్తులపేటలో శనివారం రాత్రి స్కూటీలో దూరిన త్రాసు పాముతో స్థానికులు భయంతో ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీశారు. స్కూటీ లోంచి పాముని బయటికి తీసిన స్థానిక యువకులు చంపేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

మాల మహానాడు అధ్యక్షునిగా కట్టరాయప్ప నియామకం

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ళ అరుణ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు గోదా జాన్ పాల్ ఆదేశాల మేరకు మాచర్ల మండలం విజయపురి సౌత్ మాలమహానాడు అధ్యక్షునిగా కట్ట రాయప్పను నియమించినట్లు నియోజకవర్గ మాల మహానాడు ఉద్యోగస్తుల సంఘం అధ్యక్షుడు చింతమళ్ళ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు.

ఘనంగా ప్రభ ఊరేగింపు

ప్రజాశక్తి - పెదకూరపాడు : మండలంలోని త్యాళ్లూరులో గ్రామదేవత శ్రీదేశమ్మ తల్లి పొంగళ్ళు కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. శు క్రవారం నుండి ఉద యం సాయంత్రం చిన్నలు, పెద్దలు అమ్మవారికి వారుపోసారు.ఆదివారం పెదకాపు కమిటీ వారు గ్రామం తరపున పొంగలి చేసి అమ్మవారికి నివే దించి, హారతి సమర్పించారు. మధ్యాహ్నం నుండి మేళ తాళాలు, భజంత్రీలతో ప్రభను కట్టి మహిళలు సాము హికంగా వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని పెద కూరపాడు, పాటిబండ్ల, లింగంగుంట్ల గ్రామాలలోని దేవాల యాల్లో నామస్మరణ చేపట్టారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - తుళ్లూరు : రాజధాని అమరావతి పరిధిలోని మంద ́డం సీడ్ యాక్సెస్ రహదారి వద్ద ఆదివారం ఆటోని కారు ఢీ కొట్టింది. ఆటోలో ప్రయాణి స్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. గాయ పడ్డ వారిలో ముగ్గురు మహిళలు ఉన్నారు. వీరు చిలకలూరిపేట దగ్గర మురికిపూడి గ్రామానికి చెందినవారు. క్షత గాత్రులను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తాళ్లాయపాలెం శ్రీ శైవక్షేత్రం దగ్గర నుంచి వెంకటపాలెంలోని వెంకటేశ్వర స్వామి గుడికి వెళుతుండగా ప్రమా దం జరిగింది. ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతినింది. ఆటో రోడ్డు పక్కకు బోల్తా కొట్టింది.

పేరేచర్ల సింగరయ్య తిరునాళ్లలో ఉద్రిక్తత



వివాదాన్ని నియంత్రిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని పేరేచర్ల సింగరయ్య తిరుణాలలో ఆదివారం జరిగిన ఉత్సవ వేడుకలో టిడిపి, వైసీపీ శ్రేణుల మధ్య ఉత్కంఠ నెలకొంది. పేరేచర్లలో కొన్ని దశాబ్దాలు కాలంగా సింగరయ్య కొండపైన తిరునాళ్ల జరగటం ఆనవాయితీ. పేరేచర్ల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నుండి ఒక ప్రభ, వైఎస్ఆర్సిపి నుండి ఒక ప్రభ ఆ గ్రామంలో ఉన్న వేర్వేరు పార్టీల నాయకులు ఏర్పాటు చేస్తారు. పేరేచర్లకు చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు ఎంపీటీసీ సభ్యులు మదమంచి శ్రీనివాసరావు వైయస్సార్‌సిపి తరపున ఒక ప్రభను ఏర్పాటు చేశారు. వేరేచర్ల గ్రామం నుండి సమీపంలోని తెల్లవారి దగ్గర ఉన్న సింగరయ్య కొండకులో ఊరేగింపుగా సింగరయ్య కొండకు వెళుతున్న క్రమంలో ప్రభ వెళ్లే రోడ్డుకు అడ్డంగా తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్తలు తమ జండాలను ఊపుతూ ఆ పార్టీ పాటలు పెట్టి ఘర్షణ వాతావరణానికి తెర తీశారు. పరిస్థితిని గమనించిన మేడుకుంటూ పోలీసులు రంగ ప్రవేశం చేసి టిడిపి కార్యకర్తలను సర్ది చెప్పి పక్కకు పంపడంతో వైయస్సార్సీపి ప్రభ తిరునాళ్లకు వెళ్ళింది. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

ముస్లిమ్ మైనార్టీల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా

ప్రజాశక్తి - రెంటచింతల

మేజర్ పంచాయతీ పరిధిలో నివసిస్తున్న ముస్లిం మైనార్టీ సోదరుల ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు టిడిపి సీనియర్ నేత గొంటు సుమంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం పలువురు మైనార్టీ నేతలు మాట్లాడుతూ ప్రార్ధనలు చేసుకోవడానికి ఈద్గా స్థలం లేకపోవడం వల్ల ఇక్కట్లు పడుతున్నట్లు వినతిని అందజేశారు. గత పాలకులు హామీనిచ్చి నెరవేర్చలేకపోయారన్నారు రెంటచింతలలో 370 ముస్లిం కుటుంబాలు, మూడు మసీదులు ఉన్నాయని పేర్కొన్నారు స్థానిక నజరుద్దీన్ చెరువులో 70 సెంట్లుస్థలం ఉందని దానిని కేటా యించేలా చూడాలని మైనార్టీ నేతలు కోరారు. కార్యక్రమంలో షేక్ బుజ్జి చాంద్ బాషా మీరా ఉన్నారు.

విచ్ఛలవిడిగా చోరీలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండల కేంద్రం దుగ్గిరాలలో విచ్చలవిడిగా దొంగతనాలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి స్థానిక బ్రాహ్మణ బజార్లో ఓ డిగల బుజ్జి ట్రాక్టర్లకు చెందిన మూడు బ్యాటరీలు దొంగలించారు. ఇటీవల కాలంలో నీటి పంపులు కూడా దొంగలించారు. విజయవాడ గూడూరు మూడవ రైల్వే లైను నిర్మాణం సందర్భంగా తుంగభద్ర కాలువపై రైల్వే బ్రిడ్జి వద్ద ఆ శాఖ వారు పనిచేసే సిబ్బంది సౌకర్యార్థం ఏర్పాటు చేసిన నీటి పంపును కూడా దొంగలించారు. స్థానిక అలీ నగర్‌కు పడమర వైపున పంట పొలాల్లో ఉన్న నీటి పంపు సైతం దొంగలించబడింది. పోలీస్ స్టేషన్ ఉన్న మండల కేంద్రంలో విచ్చలవిడిగా దొంగతనాలు జరుగుతుంటే పరిసర గ్రామాలలో పరిస్థితి చెప్పనవసరం లేదు. రాత్రిపూట గస్తీ లేకపోవటమే దొంగతనాలకు ప్రధాన కారణమని తెలుస్తోంది. రాత్రిపూట స్టేషన్లో ఒకరిద్దరు సెంట్రీలు తప్ప మిగతావారు తాము నివాసం ఉంటున్న ప్రాంతాలకు వెళ్ళిపోతున్నారు. ఒకరిద్దరు సిబ్బంది తప్ప ఎస్ఐతో సహా ఎవరూ హెడ్ క్వార్టర్‌లో ఉండటం లేదు. జిల్లాస్థాయి అధికారులు వెంటనే స్పందించి స్టేషన్ సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ ఉంచవలసిన అవసరంఎంతైనా ఉన్నది. దొంగతనాలు జరిగినప్పుడు బాధితుల ఫిర్యాదుల మేరకు పాత నేరస్తుల్ని పిలిపించి విచారించటం చేసిందేమీ లేదని పలువురు విమర్శిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

నాదెండ్ల మండలం సాతులూరు గ్రామానికి చెందిన దాసరి శ్రీను (45) సాతులూరులోని ఈతరం పబ్లిక్ స్కూల్ బస్సుకు క్లీనర్‌గా పనిచేస్తాడు. శనివారం సాయంత్రం మేరికపూడి గ్రామంలోని దర్గా వద్ద మొహరం పండుగ సందర్భంగా అన్నదానం నిర్వహిస్తుండగా దాసరి శ్రీను ఇంకా ముగ్గురు కలిసి ఆటోలో సాతులూరు నుండి మేరికపూడి వచ్చి అక్కడ భోజనాలు చేసి తిరిగి అదే ఆటోలో సాతులూరు బయలు దేరారు. రాత్రి సుమారు 10.15 గంటల సమయంలో మేరికపూడి పొలిమేర వద్దకు వచ్చేసరికి ఆటోకు ఎదురుగా నరసరావుపేట వైపు నుండి అశోక్ లేలాండ్ దోస్త్ వ్యాన్ డ్రైవర్ అతివేగంగా ముందు వెళుతున్న బస్సును ఓవర్ టేక్ చేయాలని ప్రయత్నించి దాసరి శ్రీను ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొట్టగా ఆటో బోల్తా కొట్టింది. ఆటో డ్రైవరుకి, దాసరి శ్రీనుకి, ఇంకొక వ్యక్తికి గాయాలు అయినాయి. దాసరి శ్రీనును వేరే ఆటోలో చికిత్స నిమిత్తం నరసరావుపేట గవర్నమెంట్ ఆసుపత్రికి తీసుకుని వెళ్ళగా డాక్టర్ పరీక్షించి మార్గమధ్యలోనే చనిపోయి నట్లు చెప్పారు. దాసరి శ్రీనుకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. దాసరి శ్రీను భార్య పద్మ ఇచ్చిన రిపోర్టు మేరకు ఫిరంగిపురం పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆదివారంనరసరావుపేట గవర్నమెంట్ ఆసుపత్రి వద్ద దాసరి శ్రీను శవపంచనామ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

తాగునీరు, పారిశుధ్యంపై మరింత నిఘా : డిపిఒ

ప్రజాశక్తి - చేబ్రోలు

తాగునీరు, పారిశుద్ధ్య కార్యక్రమాలపై మరింత నిఘా పెంచిన ఉన్నత అధికారులు . గత కొద్దిరోజుగా మండలంలోని గ్రామాల్లో జిల్లా మరియు డివిజన్ స్థాయి అధికారులు ఉదయం 6 గంటలకే క్షేత్రస్థాయిలో పర్యటన చేపట్టారు. పంచా యతీ కార్యదర్శులు పారిశుధ్య సిబ్బందితో పాటు తాగునీటి సరఫరా ఘన వ్యర్థాల సేకరణ పనులను ప్రత్యక్షంగా పరిశీ లిస్తున్నారు. కాగా బుధవారం సుద్ధపల్లి గ్రామంలో జిల్లా పంచాయతీ అధికారి వి.సాయికుమార్ సందర్శించి త్రాగునీరు నాణ్యత , పారిశుద్ధ్య పనులనులు (ఘన వ్యర్థాల నిర్వహణ), మురుగునీటి పారుదల నిర్వహణ సంబంధించిన కార్యక్రమాల ను పరిశీలిం చారు. ఆదివారం తెనాలి డివిజన్ డి ఎల్ పి ఓ స్వరూప రాణి , డిప్యూటీ ఎంపీడీవో ఎం రవిశంకర్ నారాకోడూరు గ్రామంలో పర్యటించారు . మూడు ప్రధాన పట్టణాల ప్రధాన రహదారు కూడలిలోని నారాకోడూరు జనాలతో నిత్యం ట్రాఫిక్ ఉంటుం ది. పంచాయతీ సిబ్బంది స్వచ్ఛత పాటించే విధంగా పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్టం చేయాలని సూచించారు. ఆదివారం గ్రామంలోని అంతర్గత రోడ్ల వెంబటి పెరిగిన జంగిల్‌ను రాకపోకలకు ఇబ్బంది లేకుండా తొలగించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెత్త నుండి సంపద తయారీ చేయుటకు రూపొందించిన ప్రణాళిక ప్రకారం తడి, పొడి చెత్తను వేరుగా చేయుదానిలో అధికారులు దృష్టి సారించారు. తద్వారా వానపాముల ఎరువు పొడి చెత్తను విభజించి ప్రతి బుధవారం సేల్ చేయడం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. సేంద్రియ మొక్కల పెంపకం వ్యవసాయంపై ఆసక్తి గల వారు వానపాముల ఎరువును చెత్త నుండి సంపద కేంద్రం నుంచి విక్రయించాలని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. ఇంటి నుంచి వచ్చే ఘన వ్యర్థాలను ఆరుబయట కానీ, రోడ్లపైన, మురుగు కాలువలలో కానీ వేయకుండా పంచాయతీ ఇబ్బందికి అందించాలని కోరారు. గ్రామంలోని ప్రతి ఒక్క కుటుం బం ఒక డబ్బా , ఒక సంచి (బియ్యం టిక్కీ) విధానలో తడి, పొడి చెత్తలను పంచాయతీ సిబ్బందికి ఇవ్వాలని అన్నారు. డబ్బాలో రోజు తడి చెత్త , సంచి (బియ్యం టిక్కీ)లో వారానికోసారి పొడిచెత్తను పంచాయితీ సిబ్బందికి అందించాలని అన్నారు.



డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - తుళ్లూరు

మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సిఐ కోటేశ్వరరావు హెచ్చరించారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం వెంకటపాలెం వద్ద ఆదివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా కొంతమంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వాహనాలను సీజ్ చేశారు.

సందర్శకులతో కిక్కిరిసిన కృష్ణానది తీరం

ప్రజాశక్తి - రెంటచింతల

ఆషాడ మాసంలో వచ్చే తొలి పండుగ ఏకాదశి పర్వదినాన్ని ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు మండలంలోని సత్ర శాల వద్ద ఉన్న కృష్ణానదిలో వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. శ్రీ మహావిష్ణువు యోగ నిద్రలోకి వెళ్లే రోజు కావడంతో ఆధ్యాత్మిక భావనలు ఉప్పొంగాయి. సుమారు 3 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రూ.23,916లు ఆదాయం వచ్చినట్లు ఈవో గాదె రామిరెడ్డి తెలిపారు. వివిధ సామాజిక సత్రాల్లో భారీగా అన్నదానం ఏర్పాట్లు చేశారు.

చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపండి

ప్రజాశక్తి - రాజుపాలెం

కొండమోడు- పేరేచర్ల జాతీయ రహదారి విస్తరణలో మండల కేంద్రంలోని రోడ్డుకు ఇరువైపుల ఉన్న షాపుల వారు సర్వం కోల్పోతున్నారని సిపిఎం నాయకులు గంజిమాల రవికుమార్, మెట్టు పిచ్చిరెడ్డి, మూఢమాల శ్రీనివాసరావు అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారనీ, వారు వ్యాపారం చేసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండు చేశారు.

ఘనంగా మొహరం ఉత్సవాలు

ప్రజాశక్తి- తాడేపల్లి

నాగులుమీర పీర్ల పంజా కమిటీ ఆధ్వర్యంలో నులకపేట దర్గా వద్ద ఉరుసు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి .శనివారం రాత్రి నులకపేట నాగుల్‌మీర పీర్ల పంజా వద్ద ఉరుసు ఉత్సవాలకు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి యం.స్. బేగ్ మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, గొర్ల వేణుగోపాల్ రెడ్డి ముఖ్యఅతిథిలుగా హాజరై మాట్లాడారు. పీర్ల పంజా వద్ద గంధం చల్లడం పుష్పగుచ్చాలు సమర్పించడం, ప్రత్యేకప్రార్థనలు నిర్వహించడం సాంప్రదాయంగా వస్తోందని చెప్పారు. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా గ్రామమంతటా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. సుమారు వారం రోజులు పాటు ఉత్సవాలు కొనసాగుతాయని వెల్లడించారు.ఉత్సవాలలో అగ్నిగుండం చుట్టూ పీర్ల ఊరేగింపులు, నిర్వహించబడతాయని, మండుతున్న బగ్గులపై నడిచే సాంప్రదాయాన్ని వారు పాటిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మైనారిటీ సెల్ అధ్యక్షులు చాంద్ బాషా, ఇలియాజ్,శ్రీను, ఖాసీం సాహెబ్, నాసర్ వలి, దుబాయ్ మస్తాన్ పాల్గొన్నారు.

పాఠశాలలు తెరిచారు...యూనిఫామ్ మరిచారు..

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఈ విద్య సంవత్సరంలో ప్రాఠశాలలు ప్రారంభమై 28 రోజులు కావస్తోంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన రెండు జతల యూనిఫామ్, సాక్స్, బెల్ట్, బూట్లు ఇప్పటికీ ఇవ్వలేదు. ప్రస్తు తానికి గత ప్రభుత్వం ఇచ్చిన యూనిఫామ్‌తోనే విద్యార్థులు పాఠశాలలకు వస్తున్నారు. ప్రతి సంవత్సరం సాక్సులు, బూట్లు, రెండు జతల బట్టలు (యూనిఫారం) మేలోనే గత ప్రభుత్వం ఇచ్చేది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంత వరకు యూనిఫామ్ ఇవ్వక లేదు. గొళ్ళెం వేసితిని తాళం మరచితిని అన్న చందంగా పుస్తకాలు, బ్యాగులను మాత్రం సరఫరా చేశారు. మండల స్థాయిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 88 ఉన్నాయి. పట్టణంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలలు 28, రూరల్ పరిధిలో ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలు 60 వెరసి మొత్తం 88ఉన్నాయి. విద్యార్థుల సంఖ్య 9వేల పైగా ఉంది. వీరందరికి యూనిఫామ్ రాలేదు. గతంలో కుట్టించుకున్న యూనిఫామ్‌లకు ఇప్పటి వరకు కూలి ఇవ్వలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా వెంటనే రెండు జతల బట్టలు, బెల్టు, సాక్సులు బూట్లు ఇవ్వాలని తల్లి దండ్రులు కోరుతున్నారు. దీంతో పాటుగా వెంటనే పాతవి కొత్తవి కుట్టు గూళ్ళు చార్జీలను వారి వారి ఖాతాలకు వెంటనే జమ చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంఇఓ మాట్లాడుతూ శనివారం లేదా సోమవారం యూనిఫామ్, బూట్లు, సాక్స్, బెల్టు వస్తాయని వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామని చెప్పారు. కుట్టుకూలి చార్జీలు నేరుగా తల్లిదండ్రుల ఖాతాలో బదిలీ చేస్తున్నారు. కాబట్టి ఎంత వస్తుందో తెలియదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వ హిస్తున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఈనెల 10వ తేదీన జరుగుతుంది. ఆలోపైనా యూనిఫామ్, బూట్లు, సాక్స్, బెల్టు పంపిణీ చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



1,2 తరగతుల యూనిఫామ్



3, 4, 5 తరగతుల యూనిఫామ్



6 నుంచి 10 వ తరగతి యూనిఫామ్



కరపత్రం ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఈపూరు

పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ తెచ్చిందని సిఐటియు నాయకులు కె హనుమంత రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు అమలులోకి వస్తే చట్టాలు వర్తించే కార్మికులు, చట్టాలు వర్తించని కార్మికులు బానిసత్వంలోకి నెట్ట బడతారన్నారు. లేబర్ కోడ్ ద్వారా సమ్మె హక్కులు కోల్పోతామన్నారు. కనీస వేతనం రూ.26 వేలు, ప్రభుత్వ సంస్థల ప్రైవేటుకరణ విరమణ, స్కీంలలో పనిచేసే వారిని కార్మికులుగా గుర్తింపు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ రద్దు,సమాన పనికి సమాన వేతనం తదితర డిమాండ్స్‌పై ఈనెల 9న కార్మిక, ఉద్యోగ సంఘాలు చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు.అనంతరం సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల సిఐటియు నాయ కులు మేడికొండ దేవ సహాయం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ఘనంగా తొలిఏకాదశి

ప్రజాశక్తి - వినుకొండ

తొలి ఏకాదశి పండుగ సందర్భంగా వినుకొండ కొండపై వేంచేసిన శ్రీ రామలింగేశ్వర స్వామి వారిని ఆదివారం ఉదయం ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి విచ్చేసిన చీఫ్ విప్ జీవి దంపతులకు అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జీవి మాట్లాడుతూ వినుకొండ రామలింగేశ్వర స్వామి కొండ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ఆలయ పునర్మాణానికి ముఖ్యమంత్రి వర్యులు చంద్రబాబు నాయుడు రూ. 2 కోట్లు నిధులు ఇచ్చారని తెలిపారు. చారిత్రాత్మక చరిత్ర కలిగిన శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్ది ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని తెలిపారు. స్వామివారిని దర్శించుకునేందుకు వేలాదిగా తరలివచ్చిన భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించిన మునిసిపల్, పోలీస్, దేవాదాయ, వివిధ శాఖల అధికారులను ఆయన అభినందించారు. ఆయన వెంట జిడిసిసి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు ఉన్నారు.

తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీ రామలింగే శ్వర స్వామి కొండపై శాంతి ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అఖండ జ్యోతిని ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకష్ణదేవరాయలు వెలిగిం చారు. వారు మాట్లాడుతూ అఖండ జ్యోతిని పూజించడం వలన ప్రజలకు ఎంతో శుభం జరుగుతుందని తెలిపారు. అఖండ జ్యోతిని 1000 కిలోల ఆవు నెయ్యి, 650 మీటర్ల ఒత్తితో ట్రస్ట్ వారు తయారు చేయడం ప్రాముఖ్యత కలిగి ఉందన్నారు. అఖండ జ్యోతిని దర్శించుకు నేందుకు భక్తులు వేలాదిగా కొండపైకి తరలిరావడం సంతోషకర మన్నారు. ప్రతి ఏటా తొలి ఏకాదశి పర్వదినం రోజు కొండపై అఖండ జ్యోతి ప్రజ్వలన జరుగుతుందన్నారు.

9న జరిగే కార్మిక సార్వత్రిక సమ్మెకు రైతులు భాగస్వాములవ్వాలి



మాట్లాడుతున్న ఏపూరి గోపాలరావు



కరపత్రాలు ఆవిష్కరిస్తునన రైతులు, వ్యవసాయ కూలీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కార్మిక సమ్మెకు మద్దతుగా, వ్యవసాయ రంగ రక్షణకై జిల్లా, మండల కేంద్రాలలో ఈ నెల 9న జరిగే నిరసన కార్యక్రమాలలో రైతాంగం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు పిలుపునిచ్చారు. ఆదివారం నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డు లోని ప్రజా సంఘాల కార్యాలయంలో గుంటుపల్లి బాలకష్ణ అధ్యక్షతన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి 3 వ్యవసాయ నల్ల చట్టాల రద్దు సందర్భంలో మద్దతు ధరల చట్టం చేస్తానని రాతపూర్వకంగా ఇచ్చిన హామీ అమలు చేయకుండా రైతాం గానికి తీరని ద్రోహం చేసిందన్నారు. రైతాంగ పోరాటంతో మెడలు వంచి నమస్కరించిన మోడీ రద్దు చేస్తామని చెప్పిన చట్టాలను దొడ్డిదారిన మరోరూపంలో అమలుకు పూనుకుంటున్నారన్నారు. దీంతో రైతాంగానికి మద్దతు ధరలు లభించకపోగా, పంటలు కొనుగోలు వ్యవస్థ మొత్తం కార్పొరేట్ కంపెనీల వశమవుతుందని రైతాంగం మరింత సంక్షోభంలోకి నెట్టబడతారని ఆవేదన వ్యక్తం చేశారు. 100 ఏళ్ళ చరిత్ర కలిగిన కార్మిక చట్టాలను కాలరాస్తున్నారని గ్రామీణ ఉపాధి, ఆహార భద్రతకు తూట్లు పొడిచి, అటవీ హక్కుల చట్టాన్ని నీరుగారుస్తుందని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం గిట్టుబాటు ధరల చట్టం చేయాలని, కేరళ తరహా రుణ విమోచన కమిషన్ ఏర్పాటు చేయాలని, కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, ఉపాధి హామీ పథకం 200 రోజులకు పెంచి రోజు కూలి రూ 600లకు పెంచాలని, అన్నదాత సుఖీభవ పథకం రూ 20 వేలు వెంటనే అమలు చేయాలని,విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలని, కంపెనీల పేరుతో రైతుల నుండి బలవంతంగా భూములు సేకరించరాదని, వెనుకబడిన ప్రాంతాల సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చి, నిధులు కేటాయించాలని, తదితర డిమాండ్ల సాధనకై కార్మిక వర్గంతో కలిసి రావాలన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో కార్మిక అనుకూల చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్లను ప్రవేశపెట్టి నిర్బంధంగా అమలు జరపాలని చూస్తుందన్నారు. దేశంలోని అందరికంటే మోడీ మెప్పు పొందేందుకు కూటమి పెద్దలు ప్రధానంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పని గంటలు పెంచి మరింత దూకుడుగా వ్యవహ రిస్తుందని విమర్శించారు. సార్వత్రిక సమ్మెలో కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిహెచ్.సురేష్ రాజా,ముని వెంకటేశ్వర్లు,జి జాలయ్య, రామిరెడ్డి ,లక్ష్మారెడ్డి నాగేశ్వరరావు, ఆంజనేయులు, ఎన్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల కరపత్రాలు ఆవిష్కరణ...

9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భవన ఇతర నిర్మాణ కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు షేక్.సిలార్ మసూద్ పిలుపునిచ్చారు. నరసరావుపేట మండలం లోని పలు గ్రామాలలో సమ్మె కరపాత్రాలను ఆవిష్కరించారు. సిలార్ మసూద్ మాట్లాడుతూ మోడీ పాలనలో 11 ఏళ్ళ పాలనలో స్వదేశీ, విదేశీ పారిశ్రామికవేత్తల ఆర్థిక ప్రయోజనాల కోసం కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్ లను అమలు చేస్తున్నారని 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పొడిగించేందుకు, పని భారం పెంచేందుకు శ్రీకారం చుట్టారన్నారు. యూనియన్లు పెట్టుకునే హక్కును నిరాకరిస్తున్నారని, కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనాలివ్వాలన్న చట్టబద్ధ ఆదేశాలను, న్యాయస్థానాల తీర్పులను అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు.లేబర్ కోడ్ లు అమలైతే కార్మిక సంక్షేమం, సాంఘిక భద్రత, ఉపాధి, ఉద్యోగ రక్షణ లేకుండా పోతాయన్నారు. దేశంలో నయా ఉదారవాద విధానాలు, సంస్కరణల అమలు వల్ల ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని ఉపాధి లేక నిరుద్యోగం పెరిగిందని కార్మిక వర్గంతో పాటు రైతు, వ్యవసాయ కార్మికులు, సామాన్య ప్రజలు సైతం దోపిడీకి గురావుతున్నారన్నారు. కులం, మతం, ప్రాంతం, జాతి, భాష భావోద్వేగాలను రెచ్చగొడుతూ కార్మిక వర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నారని పిఎఫ్ నిధులతో సహా ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ రంగాలలో కార్పొరేట్లకు లబ్ధిచేకూరేలా నిర్ణయించిందన్నారు. కార్పొరేట్ అనుకూల విధానాలతో కార్మికులు, రైతులు ప్రయోజనాలు దెబ్బ తింటున్నాయన్నారు. రైతాంగం పోరాటానికి తలొగ్గి కేంద్ర ప్రభుత్వం 3 వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి ఏడాది అయినా దొడ్డిదారిన అవే విధానాలు అమలు చేయాలని చూస్తున్నారన్నారు. దేశంలో వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలు సంక్షోభంలో ఉన్నప్పటికీ మోడీకి పట్టడం లేదన్నారు. పేదరికం, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం తీవ్ర సమస్యలుగా దేశ ప్రజలను పీడిస్తున్నాయన్నారు. ప్రపంచ దేశాల ముందు భారతదేశ ప్రతిష్టకు భంగం వాటిల్లితున్నా స్వార్థ రాజకీయాల కోసం ప్రజల్లో మత విద్వేషాలు రెచ్చగొడుతుందన్నారు. ఆయా కార్యక్రమాలలో భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

విచారణకు హాజరైన వైసిపి నేతలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రెంటపాళ్ళ పర్యటనలో నిబంధనలు ఉల్లంఘించారని వైసిపి నేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు. జగన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వైసిపి నేత నాగార్జున యాదవ్ మరి కొందరిపై సత్తెనపల్లి పట్టణ, రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. నేపథ్యంలో తలశిల రఘురాం గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సుదీర్ భార్గవ్ రెడ్డి నాగార్జున యాదవ్ ఆదివారం విచారణకు హాజరయ్యారు. పోలీసులు వారికి 41 నోటీసులు జారీ చేశారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి, చిన్నారి

కుక్కల స్వైర విహారం

ప్రజాశక్తి - పెదకూరపాడు

పెదకూరపాడులో కుక్కలు స్వైర చేస్తున్నాయి. ఆదివారం పదిమందిని కుక్కలు వెంటపడి కరిచాయి. వారందరూ స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్యం పొందుతున్నారు. కుక్కలు పగలు, రాత్రి తేడా లేకుండా వీధిలో తిరుగుతున్నాయి. మహిళలు, చిన్న పిల్లలు వీటిని చూసి భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలో వీధి కుక్కల సమస్యపై అనేకసార్లు గ్రామ పంచాయతీ, ఇతర అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని బాధి తులు వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వీధి కుక్కల భారీ నుండి గ్రామ ప్రజల్ని కాపాడండి అంటూ ప్రజాప్రతి నిధులను సంబంధిత అధికారులను వేడుకుంటున్నారు.

టిడిపి నాయకునికి ఎంపీ, ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు కొండా హుస్సేన్ ఇటీవల అనారోగ్యంతో శాస్త్ర చికిత్స చేయించుకుని ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకున్న నరసరావుపేట పార్లమెంటు సభ్యులు శ్రీకష్ణదేవరాయలు, మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ అండగా ఉంటుందని త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా వారు అన్నారు. వారి వెంట మాచర్ల మాజీ జడ్పిటిసి ఎస్. గోపిరెడ్డి, నేరేటి వీరస్వామి యాదవ్, సర్పంచి దేరంగుల కోటేశ్వరరావు రామిశెట్టి సైదారావు ఉన్నారు.





పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు తాడేపల్లి మండల నాయకుడు పల్లె కృష్ణ, ఆత్మకూరు, దుగ్గిరాలలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ప్రచారం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికుల హక్కులను కాపాడాలని కోరుతూ ఈనెల తొమ్మిదో తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి పారిశుద్ధ్య కార్మికులతో ఆదివారం ఉదయం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కఅష్ణ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక వైపున పారిశ్రామిక రంగాన్ని, మరోవైపున వ్యవసాయ రంగాన్ని దెబ్బ తీసే విధంగా చట్టాలు చేస్తుందని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లగా మార్చిందన్నారు. కార్మికుల పని గంటలను 10 నుండి 12 గంటల వరకు పెంచేదిగా మోడీ ప్రభుత్వం చట్టాలు చేయడం అన్యాయం అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక రంగాల నడ్డి విరిచే కార్మిక వ్యతిరేక విధానాలను దేశవ్యాప్తంగా కార్మికులు వ్యతిరేకిస్తున్నారని ఆయన అన్నారు. వెంటనే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి అన్నారు. ఈనెల 9వ తేదీన దేశవ్యాప్తంగా కార్మికుల హక్కుల కోసం జరిగే ఈ సమ్మెలో మున్సిపల్ కార్మికులు భాగస్వామ్యం అయి, సమ్మె జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల తాడేపల్లి మండల కార్యదర్శి మేకల డేవిడ్, జోజి బాబు, రాంబాబు, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మంగళగిరి మండల రూరల్ కమిటీల ఆధ్వర్యంలో ఆత్మకూరు గ్రామంలోని నిమ్మగడ్డ రామ్మోహన రావు విజ్ఞాన కేంద్రంలో కాబోతు ఈశ్వరరావు, నల్లక శ్రీధర్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఎన్డీఏ కూటమి గతంలో అనేక సంవత్సరాలుగా కార్మికులు పోరాటాల ద్వారా ప్రాణత్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడం జరిగిందని. దీనివలన కార్మికులు సంఘాలు పెట్టుకునే అవకాశం ఉండదని అన్నారు. సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసేందుకు మంగళగిరి రూరల్ గ్రామాల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రైవేటు సంస్థలకు సమ్మె నోటీసులు ఇవ్వాలని సమావేశం తీర్మానించింది. జూలై 7, 8 తేదీలలో ప్రచారం నిర్వహించాలని తీర్మానించడం జరిగింది. ఈ సమావేశంలో ప్రజా సంఘాల, పార్టీ నాయకులు వుద్దంటి దుర్గారావు జాలాది జాన్బాబు పులివర్తి శ్రీనివాసరావు జాలాది నాగేశ్వరరావు గడ్డం అజయ్ కుమార్, గజవల్లి కృష్ణ చిట్టేల జనార్ధనరావు పంతగాని మరియదాసు, చిట్టేల సీతారామాంజనేయులు మునగాల సంధ్య చింతల చెరువు జాను మునగాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

అఖిలభారత సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఈరోజు స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న 29, లేబర్ కోడులను కుదించి కార్మికులకు అన్యాయం చేస్తుందని చెప్పారు. వ్యవసాయ మోటార్లకు స్మాట్ మీటర్లు బిగించి రైతులపై భారం మోపుతున్నారని స్కీంవర్కర్లకు కనీస వేతనం 26 వేలు రూపాయలు ఇవ్వాలని, జులై 9న జరిగే సమ్మెలో అంగన్వాడీలు ఆశా వర్కర్లకు పంచాయతీ కార్మికులు మధ్యాహ్న భోజన కార్మికులు భవననిర్మాణ కార్మికులు రైతులు కౌవులు రైతులు వ్యవసాయ కార్మికులు పాల్గని జయప్రదం చేయాలని కోరారు కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, వైసిపి నాయకులు సుభాని, సిపిఐ నాయకులు కరీములా, ప్రముఖ లాయర్ వై.స్టాలిన్, జి.శ్రీనివాసరావు వై.బ్రహ్మేశ్వరరావు, ఎం. నాగమల్లేశ్వరరావు, బి.ఆమ్మిరెడ్డి, ఎన్.సుబ్బారావు, ఏలేశ్వరరావు పాల్గొన్నారు.



పెన్షన్లు పంపిణీ చేస్తున్న కోట సురేష్‌కుమార్, తూనుగుంట్ల అప్పారావు

అవోపా ఆధ్వర్యంలో పేదలకు పింఛన్లు

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక అరండల్ పేటలోని అవోప కార్యాలయంలో ఆదివారం అవోపా అధ్యక్షులు కె.వి.బ్రహ్మం అధ్యక్షతన 108 మంది పేదలకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదులుగా ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ కోట సురేష్‌కుమార్, చార్టెడ్ అకౌంటెంట్ తూనుగుంట్ల అప్పారావు పాల్గొన్నారు. డాక్టర్ కోటా సురేష్ కుమార్ మాట్లాడుతూ వృద్ధులకు వచ్చే వివిధ రకాల మానసిక సమస్యల గురించి వివరించి, పరిష్కార మార్గాలను సూచించారు. వఅద్ధులు ప్రతిరోజు కుటుంబ సభ్యులతో, స్నేహితులతో ఎక్కువ సమయం గడపాలని యోగా, నడక ద్వారా వివిధ రకాల సమస్యలను నివారించవచ్చునని తెలిపినారు. తూనుగుంట్ల అప్పారావు మాట్లాడుతూ ప్రతినెల రూ.500ల చొప్పున 108 మందికి పెన్షన్, వెయ్యి రూపాయలు విలువచేసే నిత్యావసర వస్తువులు ఇవ్వడం, వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు ఇవ్వడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రాధాకఅష్ణయ్య, ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయిరమేష్, పెన్షన్ కన్వీనర్ వెంకట్రావు, మిరియాల మోహన్, కాళంగి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మంగళగిరిలో ఫ్లెక్సీలు

ప్రజాశక్తి - మంగళగిరి



మంగళగిరిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఈనెల 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మంగళగిరి పట్టణంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలోఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం 26,000 ఇవ్వాలని, పని గంటల పని దినాన్ని పెంచిన విధానాన్ని రద్దు చేయాలని ఫ్లెక్సీలో డిమాండ్స్ ఏర్పాటు చేశారు. అన్ని రకాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని ఫ్లెక్సీలో కార్మికులకు విజ్ఞప్తి చేశారు.

ఎముకలు, కీళ్ల వ్యాధులకు అధునాతన చికిత్సలు

ప్రజాశక్తి - గుంటూరు

ఎముకలు, కీళ్ల వ్యాధులకు అధునాతన చికిత్స అందిస్తున్నామని రమేష్ హాస్పిటల్ కన్సల్టింగ్ వైద్యులు డాక్టర్ యలవర్తి రాజేష్‌కిరణ్ అన్నారు. వగాహన కార్యాలయంలో ఆదివారం ఎముకలు, కండరాలు, కీళ్ల వ్యాధులపై ఆరోగ్య సభ నిర్వహించారు. సభలో డాక్టర్ యలవర్తి రాజేష్‌కిరణ్ మాట్లాడుతూ మెడభాగంలో డిస్కులు అరిగినా, వాటికి స్థాన చలనం జరిగినా స్పాండిలైటిస్ సమస్య ఉత్పన్నమవు తుందన్నారు. స్థానచలనం జరిగిన డిస్క్ ఏ చేతికి వెళ్లే నరాలు ఒత్తిడికి గురి చేస్తే ఆ చేతికి తిమ్మిరి, జాలు, నొప్పి లాంటి సమస్యల ఉంటాయన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులలో ఈ సమస్య ఎక్కువగా వస్తుందన్నారు. మెడ సరైన పొజిషన్‌లో ఉంచకుండా ఎక్కువ సమయం పనిచేసే వారిలోనూ ఈ సమస్య కనిపిస్తుందన్నారు. ఎముకల సమస్యల గురించి మాట్లాడుతూ



మాట్లాడుతున్న డాక్టర్ యలవర్తి రాజేష్ కిరణ్

కాల్షియం శాతం ఎముకలలో తగు మోతాదులో లేకపోతే ఆస్టియో పోరోసిస్ అనే వ్యాధికి గురవుతారని, దీని వల్ల చిన్నచిన్న కారణాలకు ఎముకలు విరిగే ప్రమాదం ఉందన్నారు. డాక్టర్ రాజేష్ కిరణ్‌ను అవగాహన సభ్యులు సత్కరించారు. సభకు టి.వి.సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, వి.వి.రావు, గాయత్రి టి.సుబ్బారావు, ఎ.వి.రామారావు, రమేష్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - గుంటూరు

జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు 2025 సంవత్సరానికిగాను అర్హులైన ఉపాధ్యాయుల నుండి ప్రతిపాదనలు కోరుతున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రటనలో తెలిపారు. జిల్లాలోని మండల, ఉప విద్యాశాఖ అధికారి ద్వారా ఈనెల 13వ తేదీలోగా, http//nationalawardstoteachers.education.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - గుంటూరు

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పాతుంటూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా 11వ మహాసభ బి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. మహాసభ ప్రారంభ సూచికగా యూనియన్ జెండాను సీనియర్ నాయకులు ఆది నికల్‌సన్ ఆవిష్కరించారు. సభలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలం పూర్తయినప్పటికీ ఇప్పటికీ సంక్షేమ బోర్డు పునరుద్ధరించలేదన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. యువగళం పాదయాత్రలో నారాలోకేష్, ఎన్నికల సభల్లో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు నేటికీ నేరవేర్చలేదన్నారు.



మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ

సంక్షేమ బోర్డు లేకపోవటం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికుల కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. రాజధాని నిర్మాణాలలో కనీస నిబంధనలు పాటించకుండా, కార్మిక చట్టాలు అమలు చేయట్లేదన్నారు. రాజధాని నిర్మాణాలలో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.సంక్షేమ బోర్డులో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ రాజధాని నిర్మాణంలో వలస కార్మికులతో పనులు చేయిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వారికి కార్మిక చట్టాలు అమలు చేయట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో భవన నిర్మాణ కార్మికుల పెద్ద సంఖ్యలో పాల్గనాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జూలై 23, 24 తేదీల్లో గుంటూరులో నిర్వహించనున్న సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో ముత్యాలరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ..

అనంతరం భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా నార్నే నాగేశ్వరరావు, దండా లక్ష్మీనారాయణ, కోశాధికారిగా ఎస్.కె.భాష, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఖాసింవలి, బాబురావు, సహాయ కార్యదర్శులుగా దీవెనరావు, శ్రీనివాసరావు, మస్తాన్ వలిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

215 వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు చట్టప్రకారం రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 215 రోజులకు చేరుకున్నాయి. దీక్షలో డి.నాగేశ్వరరావు, సాంబయ్య, సుబ్బారావు, ఇస్మాయిల్, ఆదినారాయణ కూర్చున్నారు. దీక్షను సిఐటియు తాడేపల్లి మండల కార్యదర్శి వేముల దుర్గారావు, కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎసిసి కార్మికులకు నారా లోకేష్ ఇచ్చిన హామీని మర్చిపోయినట్లున్నారు అని, గుర్తుకు తెచ్చుకొని పరిష్కారం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని 33 సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న ఎసిసి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కూరపాటి స్టీవెన్, ఆశీర్వాదం, గురవయ్య, నవనీతం, తదితరులు పాల్గొన్నారు.



ఆలయ కమిటీతో ఏర్పాట్లు గురించి తెలుసుకుంటున్న ఎంపీ

సమారాధన కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - విజయపురిసౌత్

తొలి ఏకాదశిని పురస్కరించుకొని మాచర్ల మండలం తాళ్ల పల్లి గ్రామ సమీపంలోని ఎత్తిపోతల శ్రీ రంగనాయకుల స్వామి వారి ఆలయానికి జనం భారీగా తరలివచ్చారు. ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎత్తిపోతల దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేసి, సందర్శకులకు వసతులు కల్పిస్తామన్నారు. డీఎస్పీ గాంధీ రెడ్డి, మాచర్ల రూరల్ సీఐ షేక్ నఫీజ్ బాష, విజయపురి సౌత్ ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఎస్ గోపిరెడ్డి తాళ్లపల్లి సర్పంచి డి కోటేశ్వరరావు, ఆలయ సేవ సంఘం కమిటీ సభ్యులు పోలిశెట్టి చంద్రశేఖర రావు,షారాబ్ వెంకట రత్నం పాల్గొన్నారు.



సేరాతో ఊరేగింపుగా వెలుతున్న ఎమ్మెల్యే తదితరులు

శాంతి, సహనం, త్యాగానికి ప్రతీక మొహర్రం

పీర్ల చావిడిలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మాచర్ల

శాంతి, సహనం, త్యాగానికి ప్రతీకగా మొహర్రం నిలుస్తుందని శానససభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మొహర్రం పండుగను పురస్కరించుకొని తూర్పుబావి జెండా జెట్టు పీర్లచావిడిలోని పీర్లకు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి టిడిపి నాయకులతో కలసి సేరా సమర్పించి ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త మనుమడు హజరత్ ఇమామ్ హుస్సేన్ త్యాగానికి ప్రతీకగా ముస్లింలు మొహర్రం పండుగ జరుపుకొంటారని, ఇమామ్ హుస్సేన్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులందరికీ పది రోజులపాటు నివాళులర్పిస్తారన్నారు. పెద్దపీర్ల చావీడుకు ఇనుప గేటు నిర్మాణానికి రూ. 70వేలు, జండా చెట్టు చిన్న పీర్ల చావిడి ఖర్చుల నిమిత్తం రూ.40వేలు ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే జూలకంటి ప్రకటించారు. కార్యక్రమంలో ఇమామ్ జబ్బార్, కడియం ఖాసిం, ఎనుముల కేశవరెడ్డి, మద్దిగపు పెదవెంకట్రామిరెడ్డి, చినవెంకట్రామిరెడ్డి, కొమెరా దుర్గారావు, జాని బాషా, మూడవత్ వజ్రం నాయక్, షేక్ అబ్దుల్ రసూల్, షేక్ జాన్ అహ్మద్, అన్వర్ పాల్గొన్నారు.

8న ద్విచక్ర వాహనాలకు వేలం

ప్రజాశక్తి - రెంటచింతల

వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలకు సంబంధించి ఈనెల 8వ తేదీన వేలం పాటలకు పోలీస్ స్టేషన్ ఆవరణంలో నిర్వహించనున్నట్లు ఎస్సై సిహెచ్. నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు ఆసక్తి కలవారు రూ.5వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఎపిఆర్‌జెసి నూతన భవనానికి శంకుస్థాపన

రూ. 5. 83 లక్షలతో పనులు ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

విజయపురి సౌత్‌లోని ఎపిఆర్‌జెసి (ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్) కళాశాల ప్రాంగణంలో రూ. 5 కోట్ల పైచిలుకు నిధులతో నిర్మించనున్న నూతన భవన నిర్మాణానికి మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో విద్యారంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే ప్రతిభావంతుల అభ్యున్నతికి ఈ కళాశాల ఎంతో దోహదపడుతోందని పేర్కొన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఇ డబ్ల్యూఐడిసి చైర్మన్ ఎస్.రాజశేఖర్, ప్రిన్సిపల్ సరోజినీ, పి. పుల్లయ్య, బి. వెంకటేశ్వర్లు చౌదరి, ఎస్ గోపిరెడ్డి, బోయ గోపిరెడ్డి, గుండాల శ్రీనివాస్ యాదవ్, సాతులూరి. కుమార్, పుస్తపురి శ్రీరామ్మూర్తి కళాశాల సిబ్బంది విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

సమాజ స్థాపనకు, దేశ అభివృద్ధికి ఎనలేని సేవలందించిన బాబు జగ్జీవన్ రామ్ బాటలో ప్రతి ఒక్కరు పయనించాలని దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపకులు రాష్ట్ర అధ్యక్షులు కుక్కమూడి ప్రసాద్ అన్నారు. దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం దళిత బహుజన భీమ్‌సేన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం మాచర్ల పట్టణంలోని మెయిన్‌రోడ్ లోని దళిత తొలి మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ విగ్రహం వద్ద 39వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. దళిత బహుజన భీమ్సేన రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు జార్జి మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని బాబు జగ్జీవన్ రామ్ దళిత కుటుంబంలో జన్మించి కష్టపడి చదువుకొని ఉప ప్రధాని స్థాయికి ఎదిగి భారత స్వాతంత్ర్యం కోసం పోరాడి దేశానికి సేవ చేయటం గర్వంగా ఉందని అన్నారు. సామాజిక న్యాయం కోసం, సమానత్వం కోసం, సమాజంలో అణగారిన కులాల హక్కులు, సంక్షేమం కోసం వారి అభ్యున్నతికి కృషి చేసిన సంఘసంస్కర్త అని కొనియాడారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జమ్మలమడక మాజీ ఎంపీటీసీ పరిమళ రాజారావు, సీనియర్ దళిత నాయకులు మాచవరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

స్వాతంత్ర సమరయోధులు సంఘ సంస్కర్త మాజీ ఉప ప్రధాని బాబు జగజ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమం



సత్తెనపల్లి లోఆదివారం ఘనంగా నిర్వహించారు. వైసిపి సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి జగజ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ పట్టణంలోని జాషువా కళా ప్రాంగణం ఎదురుగా ఉన్న మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గ్రహముకు విగ్రహానికి జాషువా సమైక్య ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జాషువా సమాఖ్య అధ్యక్షులు చిలకల జాన్‌సుందర్రావు మాట్లాడారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వైద్య మిత్ర దళిత గిరిజన వైట్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర అధ్యక్షులు మాచర్ల బుజ్జి కాంగ్రెస్ నాయకులు, ప్రసన్నకుమార్ గోల్డెన్ బాబు జాషువా సమాఖ్య నాయకులకు పాల్గొన్నారు.

ప్రజల్లో విశ్వాసాన్ని పొందడమే లక్ష్యం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

పల్నాడు జిల్లా మాచర్ల మండలంలోని బైరవునిపాడు, 7వ మైలు, తాళ్లపల్లి గ్రామాల్లో నిర్వహించిన "సుపరి పాలనలో తొలి అడుగు - ఇంటింటికి టీడీపీ" కార్యక్రమంలో పేట పార్లమెంట్ సభ్యులు లావు కృష్ణదేవరాయలు, మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం బాధ్యతాయుత పాలనకు సంకేతమనీ, అభివృద్ధి, సంక్షేమాన్ని సమ తుల్యంగా ముందుకు తీసుకెళ్లే పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. టిడిపి ఎస్‌టిసెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.దారు నాయక్, నాయకులు బోయ గోపిరెడ్డి, కుర్రి శివారెడ్డి, నేరేటి వీరస్వామి, సాతు లూరి కుమార్, గుండాల శ్రీను, వాస్తపురి. శ్రీరామ్‌మూర్తి వి.గోవిందు పాల్గొన్నారు.

ప్రజాశక్తి పెదకూరపాడు

మండలంలోని తమ్మవరం గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య ఇంటింటికి టిడిపి తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఆ గ్రామంలోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి నాయకులు, బెల్లంకొండ రాంగోపా ల్రావు, గల్లా బాబురావు, భాష్యం ఆంజనేయులు, వడ్లమూడి అప్పారావు, షేక్ కరిముల్లా, తమ్మవరం చంద్ర బాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - విజయపురిసౌత్

సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి పాలనలో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకష్ణ దేవరాయలు అన్నారు. మాచర్ల ఎమ్యెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డితో కలిసి ఆయన మండలంలో 'సుపరి పాలనలో తొలి అడుగు'లో భాగంగా ఇంటింటికీ తెలుగు దేశం పార్టీ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఏడవమైలు, తాళ్లపల్లి, బైరవుని పాడు గ్రామాల ప్రజలకు ఏడాది పాలన గురించి వివరించారు. రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్‌అధ్యక్షుడు ఎం.దారునాయక్, పంగులూరి అంజయ్య, పంగులూరి పుల్లయ్య,కుర్రి శివారెడ్డి, నేరేటి వీరాస్వామి యాదవ్, గుండాల శ్రీను, బొల్లా వెంకటేశ్వర్లు,శేరెడ్డి గోపిరెడ్డి, బోయా గోపిరెడ్డి, పెద్దిరాజు ఎరిపల్లి వెంకటేశ్వర్లు, మైలపల్లి అప్పలరాజు, సాంబశివ రావు, రోహిత్, మధు, సైదారావు, వస్తుపూరి శ్రీ రామూర్తి పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ఉపకార వేతనాలు పంపిణీ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని ఫెన్షనర్స్ హాలులో ఆదివారం ప్రతిభావంతులైన 34 మంది విద్యార్థులకు శ్రీ విద్య మిత్రమండలి, చిలకలూరిపేట వారి ఆధ్వర్యంలో ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. నాదెండ్ల, యడ్లపాడు, చిలకలూరిపేట మండలాలు, చిలకలూరిపేట పట్టణంలోని ప్రభుత్వ హైస్కూళ్లలో చదివి 10వ తరగతి పరీక్షలలో మొదటి ర్యాంకు సాధించిన వారికి నగదు బహుమతి రూ.5వేలు, మెమెంటో అందజేశారు. 593 మార్కులతో నియోజకవర్గం ఫస్ట్ వచ్చిన విద్యార్థినికి రూ.10వేలు అందజేశారు. మొత్తం రూ.లక్ష 75వేలు పంపిణీ చేశారు. శ్రీవిద్య మిత్ర మండలి అధ్యక్షురాలు మర్రి లలితమ్మ మాట్లాడుతూ సంస్థ స్థాపించిన దగ్గర నుండి ఎంతోమంది విద్యార్థులకు వారి చదువు కొరకు వారి ఆర్థిక అవసరాలను తీర్చగలగడాన్ని మాకు సంతోషంగా ఉంటుందన్నారు. మిత్ర మండలి ట్రెజరర్ కృష్ణ కుమారి సభ్యులు ధనలక్ష్మి ఉషా రాణి, లక్ష్మీ ప్రసన్న, పద్మావతి, రాజేశ్వరి సుభాషిణి, కోటి సుబ్బారావు, సుజాత ఉపాధ్యాయులు సి.హెచ్ సుబ్బారావు, లావు నాగసంజీవ రావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందజేస్తున్న మర్రి లలితమ్మ

నల్లపాటి రాము కుటుంబానికి సిఎం చంద్రబాబు పరామర్శ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిడిసిసి బ్యాంక్ మాజీ ఛైర్మన్ నల్లపాటి శివరామ చంద్రశేఖరరావు మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. శివరామ చంద్రశేఖర రావు పెద్ద కుమారుడు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్‌కు ఆదివారం ఆయన ఫోన్ చేసి పరామర్శించారు. చంద్రశేఖరరావు ఆరోగ్య పరిస్థితులు, అందించిన వైద్యం వివరాలను చంద్రబాబుకు రాము వివరించారు. చంద్రశేఖరరావు మరణం బాధాకరమని, ధైర్యంగా ఉండాలని చంద్రబాబు సూచించారు. నల్లపాటి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోండి : ఎస్ఐ

ప్రజాశక్తి - క్రోసూరు

మొహరం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని క్రోసూరు మండల ఎస్సై రవి బాబు మండల ప్రజలకు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించి గొడవలకు దిగితే చట్టపరమైన చర్యలుంటాయన్నారు. గ్రామ పెద్దలు, చిన్న, పెద్ద తేడా లేకుండా ఉత్తేజభరితంగా జరుపుకునే ఈ వేడుకలలో అల్లర్లకు తావుండరాదన్నారు. చిన్న శరగత్, పెద్ద శరగత్ మరియు ఖత్తల్ కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిసే విధంగా సహకరించాలని కోరారు చట్ట విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో మొహర్రం వేడుకలను పురస్కరించుకొని అన్ని చోట్ల బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పెంపుడు జంతువులకు ఉచిత యాంటీ రేబిస్ టీకాలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించు కుని స్థానికంగా పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలు, పిల్లులకు ఉచితంగా యాంటీ-రేబిస్ వ్యాక్సిన్ ఆదివారం అందించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు, పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ టి. శ్రీనివాసరావు లాంఛనంగా ప్రారంభించారు. కమిషనర్ ఈ ఉచిత టీకా కార్యక్రమంలో భాగంగా మొత్తం 120 పెంపుడు జంతు వులకు రేబీస్ వ్యాక్సిన్ వేయడం జరిగింది. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల అవగాహన కల్పించడం, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేయడంలో దోహదపడింది. కార్యక్రమంలో పసుమర్రు పశు వైద్యశాల వెటర్నరీ డాక్టర్ పి. దీప్తి, పశు వైద్య సిబ్బంది లైవ్ స్టాక్ అసిస్టెంట్ రామకష్ణ, అటెండర్ కోటేశ్వరమ్మ ఉన్నారు.

సత్తెనపల్లి నుంచి అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ జి.ఎస్.వి విజయ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 8వ తేది రాత్రి 9గంటలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ (2ం2 పుష్ బ్యాక్) బస్సు బయలుదేరి 9న శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ చూసుకొని, అదే రోజు రాత్రికి అరుణాచలం చేరి, దర్శనం అనంతరం తిరిగి 10న కంచికి చేరుతుందన్నారు. కంచి దర్శనం అనంతరం రాత్రికి బస్సు బయలుదేరి 11వ తేదీ ఉదయం సత్తెనపల్లి కి చేరుతుందని చెప్పారు. పూర్తి వివరాలకు 9959225429, 7382897583, 7382896966, 7382897116 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అర్హుల జాబితా విడుదల

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలో అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులైన లబ్ధిదారుల జాబితాను ఆయా రైతు సేవ కేంద్రాల్లో ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి కట్టా లక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు జాబితాలో పేరు లేని వారు రైతు సేవ కేంద్రంలోని సిబ్బందిని సంప్రదించాలన్నారు మండల వ్యాప్తంగా 5941 మంది రైతులను అర్హులుగా గుర్తించినట్లు పేర్కొన్నారు.

నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం.. వాకింగ్ ట్రాక్

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో ఏర్పాటుచేసిన వాకింగ్ ట్రాక్ అధికారుల, ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారింది. కంకర రాళ్లు తేలి గుంతలమయంగా మారడంతో వాకింగ్ కు వచ్చే వారి సంఖ్య క్రమేపీ తగ్గుతోంది. 2014 - 19 లో టిడిపి ప్రభుత్వ హయాంలో సుమారు రూ60 లక్షలతో స్థానిక తులసీ థియేటర్ ఎదురుగా ఉన్న చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటైంది.పచ్చని మొక్కలు,చెట్లతో పచ్చదనం ఉట్టిపడేలా ట్రాక్ ను తీర్చి దిద్దారు.యువకులు,పెద్దలు నడక,జాగింగ్ తో పాటు ఎక్సర్ సైజ్ చేస్తుంటే చిన్నపిల్లల కోసం జారుడు బల్ల, ఊయల, రంగుల రాట్నంను అందుబాటులో ఉంచారు.రాజధాని నిర్మాణానికి భూములివ్వడంతో పొలం పనులు లేక శారీరక శ్రమ లేకుండా పోతుందని, నడక, జాగింగ్ లాంటివి మానసిక,శారీరక ఆరోగ్యానికి దోహదపడతాయని ట్రాక్ ఏర్పాటు చేశారు.ప్రారంభంలో పెద్దలు,మహిళలు పిల్లలు, హైకోర్టు, సెక్రటేరియట్‌లలో పనిచేసే ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో వాకింగ్ ట్రాక్ కు వచ్చేవారు. పచ్చని చెట్లు, మొక్కలతో వాకింగ్ ట్రాక్ ఆహ్లాదకరంగా ఉండడం, రోడ్లపై వాకింగ్ చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో ఎక్కువమంది వాకింగ్ ట్రాక్ కు వచ్చేవారు. క్రమేపీ వాకింగ్ ట్రాక్ కు వచ్చేవారి సంఖ్య తగ్గుతూ వస్తోంది.వాకింగ్ ట్రాక్ ఎగుడు దిగుడుగా,కంకర తేలి,గుంతలమయంగా మయంగా మారడంతో వాకింగ్ కు వద్దామన్న ఆసక్తి సన్నగిల్లుతోందని స్థానిక కొత్తూరు సెంటర్‌కు చెందిన కొమ్మినేని సత్యనారాయణ అన్నారు. ప్రభుత్వం వాకింగ్ చేయాలని, శారీరక శ్రమ చేయాలని చెబుతోందని,ఆచరణలో తగినంతగా ప్రోత్సాహం ఇవ్వడం లేదన్నారు.వాకింగ్ ట్రాక్ ఎగుడు దిగుడు గా ఉండడంతో మోకాళ్ళ నొప్పులు వచ్చే ప్రమాదం ఉందని,వయస్సు పై బడిన వారు భయ పడుతున్నారని చెప్పారు.సి ఆర్ డి ఎ అధికారులు వాకింగ్ ట్రాక్ గురించి తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరించడం తగదన్నారు. వైసిపి ప్రభుత్వంలో వాకింగ్ ట్రాక్ గురించి పట్టించుకున్న వారే లేరని,కూటమి ప్రభుత్వం స్పందించి వాకింగ్ ట్రాక్ ను అభివఅద్ధి చేయాలని ఆయన కోరారు.





వాకింగ్ ట్రాక్‌లో ఆడుకుంటున్న చిన్న పిల్లలు, కంకర తేలి, గుంతలమయంగా వాకింగ్ ట్రాక్

తెనాలి రోడ్డు విస్తరణపై

అభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోగల మంగళగిరి పట్టణంలో తెనాలి రోడ్డు విస్తరణ పై ప్రభావిత దారులతో ఆదివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్ లో అభిప్రాయ సేకరణ చేపట్టారు. గౌతమ్ బుద్ధ రోడ్డు నుండి తెనాలి రోడ్డు 60 అడుగులు విస్తరించాలని ఆలోచనలో కార్పొరేషన్ అధికారులు ఉన్నారు. దీనిపై కార్పొరేషన్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు కలిసి ఇళ్ల, షాపుల యజమానులతో, ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించారు. 127 మంది పాల్గన్నారు. గౌతమ్ బుద్ధ రోడ్డు నుండి మిద్ది సెంటర్ మీదుగా వడ్లపూడి సెంటర్ వరకు విస్తరించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అభిప్రాయాలను తీసుకోవడం జరిగింది. 112 నిర్మాణాలు విస్తరణలో పోయేటట్లుగా ఉన్నాయని వివరించారు. అభిప్రాయాల సేకరణ మేరకు చర్చించి మరొకసారి సమావేశం కావాలని సమావేశం నిర్ణయించినట్లుగా అధికారులు తెలిపారు

సూపర్-6 హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లి

తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని వైసి పి మంగళగిరినియోజకవర్గ కన్వీనర్ దొంతిరెడ్డి వేమారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణంలోని అంజిరెడ్డి భవన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైయస్సార్సీపి అధినేత మాజీ ముఖ్యమంత్రివర్యులు శ్రీ వైయస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో భాగంగా తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా నాగయ్య అధ్యక్షతన తాడేపల్లి మండల స్థాయి కార్యక్రమ నిర్వహించారు. వేమారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి సంవత్సరం కాలం గడిచిన వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందనివిమర్శించారు. ఎన్నికలకు ముందు అధికారం కోసం దొంగ హామీలు ఇచ్చి ఇప్పుడు ఆ హామీలు అడిగే వారి మీద కక్షపూరిత రాజకీయాలు చేసి కేసులు పెడుతున్నారు అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తాడేపల్లి మండల గౌరవ అధ్యక్షులు పాటిబండ్ల కృష్ణమూర్తి, తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా నాగయ్య, తాడేపల్లి మండల మహిళా అధ్యక్షురాలు గోరా నాగ స్రవంతి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు సంకురు మరియబాబు, మండల యువజన విభాగా అధ్యక్షులు దొంతిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మండల విద్యార్థి విభాగ అధ్యక్షులు బండ్ల రాజేష్, మండల దివ్యాంగుల అధ్యక్షులు మన్నకుమార్ ఆంజనేయులు, మండల రైతు విభాగ అధ్యక్షులు మేక ప్రభాకర్‌రెడ్డి, మండల ఎస్‌టి విభాగ అధ్యక్షులు బాణావత్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి









జగజ్జీవన్ రావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు, తాడేపల్లి, తుళ్లూరు, పెదకాకానిలో నివాళులర్పిస్తున్న నాయకులు

పేదల అభ్యున్నతికి నిరంతరం పాటుపడిన బాబూ జగ్జీవన్‌రామ్

ప్రజాశక్తి - మంగళగిరి

పేదల అభివృద్ధికి నిరంతరం పాటు పడిన మహావ్యక్తి జగజ్జీవన్‌రావు అని కాంగ్రెస్ నేతలు కొనియాడారు. జగజ్జీవన్‌రావు వర్ధంతి సందర్భంగా మంగళగిరిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఆదివారం నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ సలీం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, జిల్లా కాపు సంఘ సాధికారక చైర్మన్ రేమినిశెట్టి హనుమంతరావు, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు షేక్ మున్నీ, రూరల్ మండల ప్రెసిడెంట్ కుప్పాలకృష్ణ చౌదరి, తాడేపల్లి మండల ప్రెసిడెంట్ పఠాన్ సుభాని. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ బి.సమర్పణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి

బాబు జగజ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమాలను వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముగ్గు రోడ్డు వద్ద గల బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యదర్శి రోడ్డ ఎలీషా ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి విచ్చేసి బాబు జగజీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులుమూడి డేవిడ్ రాజు, పట్టణ ఉపాధ్యక్షులు వేల్పుల ఎలీషా, తాడేపల్లి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలుకోటి శ్రీనివాస మధు, పట్టణ సోషల్ మీడియా ప్రధానకార్యదర్శి బోయలపల్లి రాజు, బీసీ నాయకులు బత్తుల దాసు, దుగ్గి వంశీ,కాటిపల్లి రూబెన్, బడిపాటి క్రాంతి,కటికల కళ్యాణ్, తాతపూడి శ్యాంబాబు, బుదలా జార్జ్ , మామిళ్ళ పాల్, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు

దళితుల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించిన భారత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రాం చిరస్మరణీయులని వైసిపి నాయకులు ఘనంగా నివాళులర్పించారు.జగజ్జీవన్ రాం వర్ధంతి కార్యక్రమం మండల పరిధిలోని అనంతవ రంలో ఆదివారం జరిగింది. జగ్జీవన్ రాం విగ్రహానికి వైసిపి నాయ కులు ఆరేపల్లి జోజి,మేకల థామస్, కొప్పుల శేషగిరి రావు, మేకల జయరాజు, మేకల ముక్కంటి పూల మాలలు వేసి దళితుల కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని

స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త. రాజకీయవేత్త మాజీ ఉపరాష్ట్రపతి డాక్టర్ బాబూ జగ్జీవన్ రావు 39వ వర్ధంతి పెదకాకాని మండలం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పెదకాకాని మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మండలంలోని పార్టీ రాష్ట్ర, జిల్లా, మండలం, గ్రామం నాయకులు, సర్పంచ్ లు, ఎంపీటీసీలు, వార్డు నెంబర్లు, పార్టీ అనుబంద కమిటీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తెనాలి

భారత మాజీ ఉప ప్రధాని బాబు జగజ్జీవన్ రామ్ వర్ధంతి వేడుకలు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రూరల్ గ్రామం కొలకలూరు లో గ్రామానికి చెందిన ఆది జాంభవ దళిత్ ఎంప్లాయిస్ సేవా సమితి (డెస్క్) ఆధ్వర్యంలో గ్రామ ప్రధాన కూడలిలోని జగజీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. జగజ్జీవన్ రావు చైర్ అధ్యక్షులు డాక్టర్ పొన్నెకంటి జోసఫ్ రత్నాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో డెస్క్ బృందం యడ్లపల్లి రవికిరణ్, ఎస్.శరత్ వెంకయ్య, ఎం.గురుదేవ్, కె.పాపా రావు, ఎస్ వినయ్ కుమార్, కె నాగేశ్వరరావు, పి అనిల్ కుమార్, ఎన్.జోసెఫ్, ఉన్నం ధర్మారావు, ఎస్ కనకారావు, పి.రాజా పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాబూ జగ్జీవన్రామ్ చైర్ ఆధ్వర్యంలో ఆదివారం భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాబూ జగ్జీవన్రామ్ చైర్ డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్ అధ్యక్షత వహించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, పూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య ఎం.త్రిమూర్తిరావు, కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమీషనర్ కె వంజుబాబు, ఏఎన్‌ఐయూ పరీక్షల విభాగం సీఈ ఎ.శివప్రసాదరావు తదితరులు నివాళులర్పించారు.





గుంతలు తీసిన ఉన్న దృశ్యాలు

గుంతలు తీశారు.. అంతే వదిలేశారు

ప్రజల రాకపోకలకు ఇబ్బంది

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి పట్టణం డొలస్ నగర్ రైల్వే ట్రాక్ దగ్గర బ్రహ్మానందపురం, పాత సిమెంట్ ఫ్యాక్టరీ లోపల ప్రాంతానికి వెళ్ళటానికి వీలుగా ఉన్న సిమెంట్ రోడ్డును డ్రైనేజీ పనులు కోసమని పెద్ద గుంతలు తవ్వి ఎం టి ఎం సి సిబ్బంది వది లేయడం పట్ల స్థానిక ప్రజలు అసంతఅప్తి వ్యక్తం చేస్తున్నారు. పదిహేను రోజులు నుండి రాకపోకలు అయ్యాయని వాపోతున్నారు. పెద్ద కందకాలు లాగా గోతులైతే తీశారు కానీ పనులు ఇంకా మొదలు పెట్టలేదు అని అసంతఅప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆ చుటుపక్కల పిల్లలు పెద్దలు రోడ్ల పైకి వచ్చినప్పుడల్లా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని గడుపుతున్నామని వాపోతున్నారు. సంబంధిత అధికారులు ఆ పను లు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



తేజో తన్వయ ను అభినందిస్తున్న గ్రామ పెద్దలు

ఐఐటిలో వరగాని విద్యార్థినికి 490వ ర్యాంక్

ప్రజాశక్తి - పెదనందిపాడు

ఐఐటీలో వరగాని గ్రామానికి చెందిన తేజో తన్మయ 490 ర్యాంకు సాధించింది. ప్రత్తిపాడులో గల అక్షయ విద్యాలయం చైర్మన్ వెలగా రాఘవయ్య చౌదరి, శ్రీవల్లి చౌదరి దంపతుల కుమార్తె అయిన తేజో తన్మయ అదే పాఠశాలలో పదోతరగతి వరకు చదివి ఆ తరువాత విజయవాడలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. తొలి నుంచి చదువులో ప్రథమ స్థానంలో ఉన్న తన్మయ ఐఐటీలో 490 ర్యాంకు సాధించడంపై గ్రామ పెద్దలు వెలగా రామారావు, ఉమామహేశ్వర ,యర్రం సుబ్బారావు, బండారు రాంబాబు, కుర్రా వెంకటేశ్వరావు, శివయ్య మాస్టారు, వరగాని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెన్నుపాటి సురేంద్రనాథ్, మాజీ జనసేన మండల పార్టీ అధ్యక్షులు కొల్లా గోపీనాథ్, తెలుగుదేశం పార్టీ నాయకులు నూతి పూర్ణచంద్రరావు, చీరాల పెదబాబు మరియు జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు చెన్నుపాటి శివ నాగేశ్వరరావు వారి తల్లిదండ్రుల బంధువుల ఆత్మీయుల మధ్య తేజో తన్మయని అభినందించారు.

ఆర్ఎస్ఎస్ అజెండాతో బిజెపి పాలన : సిపిఐ

ప్రజాశక్తి - మంగళగిరి

బిజెపి ఆర్ఎస్ఎస్ ఎజెండాతో కేంద్రంలో పరిపాలన చేస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఆదివారం సిపిఐ కార్యాలయంలో జరిగిన సిపిఐ పట్టణ మహాసభలో పాల్గొని ప్రసంగించారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో లక్షల కోట్లు అప్పు చేశారే కానీ ఎటువంటి అభివృద్ధి కనిపించడం లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అదానికి, కార్పొరేట్ సంస్థలకు దాసోహం అంటుందని దేశ ఆర్థిక వ్యవస్థను వారి దగ్గర తాకట్టు పెడుతుందని, ఆర్థికంగా భారతదేశాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శికే రామకృష్ణ ధ్వజమెత్తారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ పేద అణగారిన వర్గాలకు ఎప్పుడు అండగా ఉంటుందని ఆయన అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఫాదర్ బాలస్వామి

అత్యుత్తమ ఫలితాలు సాధించిన యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాల పాలిటెక్నిక్ విద్యార్థులు

ప్రజాశక్తి -మేడికొండూరు

మండలంలోని నరసరావుపేట రోడ్ లోని డోకిపర్రు యూనివర్సల్ ఇంజనీరింగ్ కళాశాల పాలిటెక్నిక్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలని కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ ఫాదర్ పి బాలస్వామి తెలిపారు. ఇటీవల పాలిటెక్నిక్ సంబంధించి విడుదలైన ఎస్టీ టెట్ ఫలితాలలో తమ కళాశాల కు చెందిన పాలిటెక్నిక్ విభాగపు విద్యార్థులు ప్రథమ ద్వితీయ నాలుగ వ సెమిస్టర్ హాలో మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందిస్తూ ఏర్పడిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం దిశగా రాణించాలని, తల్లిదండ్రులతో పాటు, చదువుతున్న విద్యాసంస్థలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. స్టేట్ బ్యాంక్ సాధించిన విద్యార్థులకు బహుమతులను చేశారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయరామిరెడ్డి మాట్లాడుతూ నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో షేక్ ఫాతిమా 98.4% స్టేట్ ర్యాంకు సాధించిందని ప్రథమ సంవత్సరం ఫలితాలలో వి చంద్రకళ 97. 9 పర్సంటేజ్ మార్కులతో మంచి రంగులు సాధించాలని తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం కోటిరెడ్డి మాట్లాడుతూ మంచి విద్యాబోధనతో పాటు ల్యాబ్ సదుపాయం క్రమశిక్షణ వల్లనే ఈ విజయం సాధ్యమైందని అన్నారు. సంవత్సరం కళాశాలలో ప్లేస్మెంట్స్ కూడా విద్యార్థిని విద్యార్థులకు మంచి శిక్షణతో పాటు బహుళ జాతి కంపెనీల ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు విస్తారంగా ఉన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోషి పలువురు అధ్యాపక సిబ్బంది, విద్యార్థిని ,విద్యార్థులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

ఏటుకూరి గంగాధరరావుకు ఘన నివాళులు

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

విద్యుత్ స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు పిలుపునిచ్చారు. ఈనెల 9వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం మంగళగిరి రూరల్ మండలం మాజీ కార్యదర్శి వై.గంగాధరరావు 5వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఘన నివాళులర్పించారు. చినకాకాని గ్రామంలో గంగాధర రావు విగ్రహాలకు, చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం కార్యాలయంలో జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడారు. గ్రామం లో సిపిఎం నిర్మాణానికి గంగాధర రావు ఎంతో కఅషి చేశారని, ప్రస్తుత ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఇవ్వగలం పాదయాత్ర సమయంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మాట్లాడారని, స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే ఆ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చిన లోకేష్ నేడు వాటిని సిబ్బంది పెడుతుంటే లోకేష్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆంధ్రలో బిజెపి బలోపేతానికి టిడిపి, జనసేనా, వైసిపి లు పోటీపడటం సిగ్గు చేటన్నారు. కేంద్రంలో బిజెపి చట్టాల మార్పు చేస్తూ విపక్షాలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఆంధ్రలోని అధికార టిడిపి కూటమి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అధికారం లోకి వచ్చాక దాడులు పరిపాటి గా జరుగుతున్నాయని, ఇది సరైనది కాదన్నారు. గంగాధర రావు స్ఫూర్తితో ప్రజా సమస్యల పై, రైతాంగ సమస్యలపై పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఉద్దంటి దుర్గారావు, గండికోట బాబు వరప్రసాద్, వట్రం పూర్ణయ్య, కాజా శివ శంకరరావు, పలగాని రాంబాబు, తుల్లిమిల్లి బ్రహ్మయ్య, కాజా సాంబశివరావు, గుర్రం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ కార్డుతో కార్మికులకు మేలు



- ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలి
- కనీస వేతనాల అమలుకు చర్యలు
- ప్రజాశక్తితో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ గాయత్రీదేవి



అసంఘటిత రంగ కార్మికులంతా ఈ శ్రమ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కోరారు. ఈ శ్రమ నమోదు చేసుకున్న వారికి కేంద్ర ప్రభుత్వం నుంచి బీమాతోపాటు పలు ప్రయోజనాలు లభిస్తాయని ఆమె తెలిపారు. జిల్లాలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులు, కార్మికులకు కనీస వేతనాలు అమలుకు చర్యలు తీసుకుంటున్నామని ఆమె వివరించారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు అంశాలు తెలియజేశారు.

'ఈ-శ్రమ'లో జూన్ వరకు ఎంత మంది నమోదయ్యారు?

అసంఘటితరంగంలో పనిచేస్తున్న కార్మికలకు ఈశ్రమ పోర్టల్ కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. ఇప్పటి వరకు ఈ శ్రమ పోర్టల్‌లో 6.63,362 మంది నమోదు అయ్యారు. ఈఎస్ఐ, పిఎఫ్ పొందని కార్మికులు ఎవరైనా ఈ శ్రమలో నమోదు కావచ్చు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఈ శ్రమలో నమోదు అయి ఉన్న వారు ప్రమాదంలో మృతి చెందితే రూ.2లక్షలు, వైకల్యం పొందితే రూ.లక్ష వరకు ప్రభుత్వం సాయం అందిస్తుంది. వివిధ రంగాల్లో పనిచేస్తున్న 18 నుంచి 59 ఏళ్లలోపు వారు ఎవరైనా తమ పేర్లు కార్మిక శాఖ కార్యాలయాలలో నమోదు చేసుకోవచ్చు.

జిల్లాలో అసంఘటిత రంగ కార్మికులు ఎంతమంది ఉన్నారు?

జిల్లాలో అసంఘటిత రంగంలో 9.83 లక్షల మంది కార్మికులు ఉన్నట్టు అంచనా. దాదాపు 75 శాతం మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. మిగతా వారిని కూడా ఈ పోర్టల్‌లో నమోదుకు చర్యలు తీసుకుంటున్నాం. భవన నిర్మాణ కార్మికులకు ఉన్న సౌకర్యాలను అమలు చేసేందుకు వారు తప్పని సరిగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

భవన నిర్మాణ కార్మికులు ఎంత మంది నమోదయ్యారు?

జిల్లాలో ఇప్పటి వరకు 2.49 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఇంకా నమోదు చేసుకోని వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. రూ.110 చెల్లించి ఐదేళ్ల పాటు కార్మికులుగా రిజిస్ట్రేషన్ కొనసాగించవచ్చు. ఆ తరువాత ఏటా రూ.12 చెల్లిస్తే సరిపోతుంది. వీరికి బీమా సదుపాయాలు లభిస్తాయి. పలు సంక్షేమ పథకాలు వర్తింపచేస్తాం.

కనీస వేతనాల అమలుకు చర్యలు?

కార్మికులకు కనీస వేతనాలు అమలుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం వేతనాలు ఆన్‌లైన్‌లో పోస్టింగ్ చేయడం వల్ల తమకు ఎప్పటికప్పుడు వివరాలు వస్తున్నాయి. కనీస వేతనాలు అమలు చేయని సంస్థలపై చర్యలు తీసుకుంటాం.

ఉద్యోగులకు దినసరి వేతనాలు?

జిల్లాలో 2025-26 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ శాఖల్లో పనిచేసే దినసరి కార్మికులు, ఉద్యోగులకు (ఎన్ఎంఆర్) రోజు వారి వేతనాల పెంపునకు జిల్లా కమిటీ ఆమోదించింది. అత్యంత నైపుణ్యత కలిగిన వారికి రూ.910, నైపుణ్యత కలిగిన వారికి రూ.860, పాక్షిక నైపుణ్యత కలిగిన వారికి రూ.800, నైపుణ్యత లేని వారికి రూ.680గా కమిటీ నిర్ణయించింది. జిల్లా కలెక్టర్ ఆమోదంతో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఈ వేతనాలు అమలుకు చర్యలు తీసుకుంటాం.

బాలకార్మికుల నిరోధానికి తీసుకుంటున్న చర్యలు?

జిల్లాలో బాలకార్మికులను గుర్తించేందుకు వివిధ శాఖల సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు చేస్తున్నాం. ఇందుకు పోలీసుల సహకారం కూడా తీసుకుంటున్నాం. బాలకార్మికులను పనుల్లో పెట్టుకుంటే వారిపై కేసు నమోదు చేయడంతో పాటు భారీగా జరిమానా విధిస్తున్నాం. దుకాణాలు, వ్యాపార సంస్థలు, కర్మాగారాల్లో బాల కార్మికులను పనులో పెట్టుకుంటే సంబంధిత సంస్థలపై కేసులు నమోదు చేస్తామని, భారీ జరిమానాలు విధిస్తాం.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలోనే ప్రత్యేకంగా పల్నాడు బాలోత్సవం

- విద్యార్థుల్లో మరింతగా విస్తరించాలి
- నిర్వాహకులు, న్యాయ నిర్ణేతల అభినందన సభలో వక్తలు
- నూతన అధ్యక్షునిగా డాక్టర్ మస్తాన్ షరీఫ్ ఎన్నిక







బాలోత్సవం సావనీర్ ఆవిష్కరిస్తున్న మధు, పల్నాడు బాలోత్సవం అధ్యక్షులు డాక్టర్ షేక్.మస్తాన్ షరీఫ్, కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బాలోత్సవాల నిర్వహణలో రాష్ట్రంలోనే పల్నాడు జిల్లా ప్రత్యేక స్థానాన్ని పొందిందని రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు అన్నారు. పల్నాడు బాలోత్సవం పిల్లల పండుగ నిర్వాహకులు, న్యాయ నిర్ణేతల అభినందన సభ నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. సభకు పల్నాడు బాలోత్సవం కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా జిసిడిఒ డి.రేవతి మాట్లాడుతూ కంప్యూటర్ టీవీ, సెల్ఫోన్ల పట్ల బాలలు ఆకర్షితులై విజ్ఞానదాయక కార్యక్రమాలకు ఆటపాటలకు దూరమై యాంత్రికంగా తయారవుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. మార్కులు, ర్యాంకుల వేటలో పడి సృజనాత్మకత, స్నేహ సంబంధాలు మెరుగు పరుచుకో లేకపోతున్నారని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పిల్లల భాగస్వాములైతేనే మానసిక పరిపక్వత వస్తుందన్నారు. ఈ ప్రయత్నంలో భాగంగా ఎన్నో వ్యయ, ప్రయాసలతో బాలోత్సవం కమిటీ ఈ పండుగలను నిర్వహిస్తోందని అభినందించారు. పిల్లల మానసిక వికాసానికి తోడ్పడుతున్న బాలోత్సవ కార్యక్రమాలను ఉద్యమ తరహాలో విస్తరింపజేయాలన్నారు. పల్నాడు బాలోత్సవాల గౌరవ అధ్యక్షులు ఎంఎస్ఆర్‌కె. ప్రసాద్, కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా కళల పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తి కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లల కంటే ప్రేక్షకులు, న్యాయ నిర్ణేతలు తల్లిదండ్రులే ఎక్కువ ఆనందం పొందుతున్నారన్నారు. మారిన విద్యా పరిస్థితుల్లో పిల్లలు తమ బాల్యాన్ని కోల్పోతున్నారని, ప్రస్తుత విద్యా విధానంలో విద్యార్థులకు ఆసక్తి కలిగించే అంశాలేమి ఉండడం లేదని చెప్పారు. ఈ పరిస్థితులలో మార్పు తేవాల్సిన అవసరం ఉందన్నారు. లఘు నాటికలు, శాస్త్రీయ నృత్యం, పాటలు, వ్యాసరచన, పోస్టర్ ప్రజెంటేషన్, కోలాటం, హ్యాండ్ రైటింగ్, సైన్స్ ప్రయోగాలు, కథా రచన, కథావిశ్లేషణ, మ్యాప్, ఏకపాత్రాభినయం, మైమ్, మ్యూజిక్, మిమిక్రీ, డిబేట్, క్విజ్, అంతర్జాలంలో అన్వేషణ వంటి పోటీల్లో చిన్నారులు తమ ప్రతిభను ప్రదర్శించారన్నారు. బాలోత్సవాల ద్వారా విద్యార్థులలో స్నేహభావం, నాయకత్వ లక్షణాలు, పోటీతత్వం, అభ్యుదయ భావాలు పెరుగుతాయన్నారు. పోటీలలో ఓడిపోయినా, పరీక్షల్లో తప్పినా అయినా నిరాశకు గురవకుండా ధైర్యంగా ఉండేలా పట్టుదలతో ప్రయత్నించి లక్ష్యాన్ని సాధించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని చెప్పారు.

పల్నాడు బాలోత్సవం అధ్యక్షులుగా డాక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్

పల్నాడు బాలోత్సవం పిల్లల పండుగ కార్యక్రమానికి నూతన అధ్యక్షులుగా నరసరావుపేట ఈశ్వర్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్‌ను బాలోత్సవ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలోత్సవాల విస్తరణ వంతు కృషి చేస్తానన్నారు. పల్నాడు జిల్లాలో వెనుకబడిన ప్రాంతాల నుండి విద్యార్థులను ప్రోత్సహించి బాలోత్సవాల్లో పాల్గొనేలా కృషి చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఎఎం కళాశాల చైర్మన్ మేదరమెట్ల శేషగిరిరావు, పల్నాడు బాలోత్సవాల బాధ్యులు షేక్ మొహమ్మద్ గౌస్, ఎం.సాంబశివరావు, టి.అంజిరెడ్డి, ఎన్.వెంకట్, ఎ.భాగ్యశ్రీదేవి, ఆర్గనైజర్లు, న్యాయ నిర్ణేతలు పాల్గొన్నారు.

నిడమర్రులో స్మార్ట్ మీటర్లను అడ్డుకున్న మహిళలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకున్నారు. ఈ నిరసన కార్యక్రమానికి సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు ఎం.భాగ్యరాజు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఎం.రవి, బి.లక్ష్మణరావులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ఆదానికి పాలకులు కట్టబెడుతున్నారని అన్నారు. విద్యుత్ వినియోగదారులపై 15 వేల కోట్ల విద్యుత్ బారాలు మోపారని అన్నారు. ఇంటి యజమానుల అనుమతి లేకుండా దౌర్జన్యంగా స్మార్ట్ మీటర్లు బిగిస్తే అడ్డుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిడమర్రు టిడ్కో గఅహాలలో యజమాను ల అనుమతి లేకుండా బిగించిన స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాల నీ వారు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం టిడ్కో గృహాలలో స్మార్ట్ మీటర్లు బిగించేందుకు వచ్చిన విద్యుత్ సిబ్బందిని అడ్డుకున్న మహిళలను వారు అభినందించారు. స్మార్ట్ మీటర్లు బిగించనీయకపోతే కరెంటు కట్ చేస్తామంటూ విద్యుత్ సిబ్బంది బెదిరింపులకు దిగడాన్ని రవి, లక్ష్మణరావు ఖండించారు గతంలో స్మార్ట్ మీటర్లు పెడితే పగల గొట్టమని చెప్పిన నాయకులు మాట తప్పి నేడు స్మార్ట్ మీటర్లుఎందుకు బిగిస్తున్నార నీ వారు ప్రశ్నించారు. గతంలో విద్యుత్ బారాలేసినందుకు బషీర్బాగ్‌లో ముగ్గురిని కాల్చి చంపినందుకు ప్రజలు 10 సంవత్సరాలు అధికారానికి దూరం పెట్టిన విషయం మర్చిపోయి మరల విద్యుత్ భారాలు వేస్తారా అని ప్రశ్నించారు. తక్షణం పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీలు పెంచమని కూటమి నాయకులు చెప్పిన మాట నిలబెట్టు కోవాలని కోరారు. ప్రజలపై విద్యుత్ బారాలు వేసి కార్పొరేట్లకు, ఆదానికి దోచిపెట్టడం మాను కోవాలని, విద్యుత్ బారాలను తగ్గించక పోతే ప్రజలు మరోసారి తగిన గుణపాఠం చెప్పి తీరుతారని రవి, లక్ష్మణరావు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో టిట్కో గృహాల లబ్ధిదారుల అభివృద్ధి కమిటీ సభ్యులు లక్ష్మి, ప్రకాష్, ముసలయ్య, టి.లక్ష్మి, తులసి పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎం. భాగ్యరాజు